తెలుగు దినపత్రిక
ప్రభాత
jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 01
సంచిక : 15
పేజీలు : 8
వెల : 4
మల్కాజిగిరి
గురువారం, 27-07-2023

జయభేరి దినపత్రిక, జయభేరి ఛానల్‌లో
నిఖార్సైన జర్నలిస్టులుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు.. కథనాలు...
ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలనుకుంటున్నారా?
మీ కలాలకు పదును పెట్టండి....
విలేకర్లు కావలెను
ఆసక్తి కలిగిన యువతి యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత
email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com
9391 544 889 call me

2 కిషన్ రెడ్డా.. కొత్త సీఎం..?

4 సోమవారం వరకు సెలవు లేనా?

7 సిరుల పంటగా టమాటా



2 లో

# వీరిజాడ ఎక్కడ..?

**తెలంగాణలో 40 వేలు.. ఏపీలో 30 వేల మంది మహిళలు మిస్సింగ్.. కేంద్ర హోంశాఖ ప్రకటన**

## ముత్యంధార జలపాతం వద్ద చిక్కుకున్న 84 మంది పర్యాటకులు..



# రంగంలోకి రెస్క్యూ టీమ్స్

ములుగు జిల్లా ముత్యంధార జలపాతం వద్ద 84 మంది పర్యాటకులు చిక్కుకున్నారు. పోలీసులు, రెస్క్యూ టీమ్ లు ఘటనా స్థలానికి చేరుకుని పర్యాటకులను రక్షించేందుకు చర్యలు చేపట్టారు. ముందు జాగ్రత్త చర్యలపై డీజీపీ ఆదేశాలు.. మరో రెండు రోజులు అతి భారీ వర్షాలు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

2 లో


5 లో

## మహోగ్ర గోదావరి.. భద్రాచలం వద్ద 47 అడుగులు దాటి ప్రవాహం..!

గోదావరి నది మహోగ్ర రూపం దాలుస్తున్నది. భారీ వర్షాలకు పరీవాహక ప్రాంతాలతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా నదిలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. భద్రాచలం వద్ద గోదావరి 48 అడుగుల మేర ప్రవహిస్తున్నది. మధ్యాహ్నం 44 అడుగులు దాటగా.. అధికారులు తొలి ప్రమాద హెచ్చరిక జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం 48 అడుగులకు చేరితో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. పరిసర ప్రాంతాల్లో ఇంకా భారీ వర్షాలు కొనసాగుతున్నందున ఇంకా గోదావరిలో ఇంకా ప్రవాహం పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. 53 అడుగులకు చేరితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు. గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఇప్పటికే ఆలయ పరిసరాల్లోకి వరద నీరు చేరింది. అన్నదాన సంత్రంలోకి వాన నీరు వచ్చింది. వరద నేపథ్యంలో అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. గంటలు గడిచే కొద్ది నదిలో ప్రవాహం పెరుగుతున్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. మరో వైపు భద్రాద్రి జిల్లాలో భారీ వర్షం కురిసింది. అత్యధికంగా పినపాక మండలం కరకగూడెంలో 22 సెంటీమీటర్ల వర్షాపాతం రికార్డయ్యింది. ములకలపల్లి మండలంలో వాగుతుండగా మహిళ గల్లంతయ్యింది. ఆమె కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై

## సి.ఎస్ శాంతి కుమారి సమీక్ష

**జయభేరి, హైదరాబాద్ :**



రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రానున్న 48 గంటలలో అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించినందున అత్యంత అప్రమత్తతతో ఉండాలని జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమీషనర్లు, ఎస్.పి లతో టెలీ కాన్ఫరెన్స్ ను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి నేడు సాయంత్రం నిర్వహించారు. డీజీపీ అంజనీ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకృష్ణా రావు, రజత్ కుమార్, సునీల్ శర్మ, విపత్తుల నిర్వహణ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి శ్రీనివాస రాజు, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి రిజ్వి, జీహెచ్ ఎంసీ కమీషనర్ రొనాల్డ్ రోస్ తదితరులు ఈ కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, రానున్న 48 గంటలలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐ.ఎం.డి హెచ్చరించిన నేపథ్యంలో ఏవిధమైన ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా విస్తృత స్థాయిలో చర్యలు చేపట్టాలని తెలిపారు. ఇప్పటికే గోదావరి బేసిన్ లో పలు ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు, కాలువలు పూర్తి స్థాయి నీటి మట్టం తో ప్రవహిస్తున్నాయని, రెండు రోజుల్లో కురిసే భారీ వర్షాల వల్ల అవి మరింత ప్రమాద స్థాయిలో ప్రవహించే అవకాశముందని హెచ్చరించారు. నిండిన ప్రతీ చెరువు వద్ద, ప్రమాద స్థాయిలో ప్రవహిస్తున్న కాజ్ వే లవద్ద ప్రత్యేక అధికారులు, పోలీస్ అధికారులను నియమించి తగు జాగ్రత చర్యలను చేపట్టాలని అన్నారు. లోతట్టు ప్రాంతాలు, ముంపుకు గురయ్యే ప్రాంతాలలో అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ఇప్పటికే గుర్తించిన పునరావాస కేంద్రాలలో అవసరమైన వస్తు సామాగ్రి ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్షాలకు దెబ్బతినే రాష్ట్ర, నేషనల్ హైవే రోడ్లను వెంటనే మరమ్మతులు జరపాలని ఆదేశించారు. భద్రాచలంలో ఇప్పటికే ఒకటవ ప్రమాద హెచ్చరిక జారీ చేసారని, గోదావరి కి వచ్చే వరదను సమీక్షిస్తూ తగు జాగ్రత చర్యలను తీసుకోవాలని కోరారు. అన్ని గ్రామాలలో శానిటేషన్ పనులను ముమ్మరంగా నిర్వహించాలని అన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్ దళాలను సిద్ధంగా ఉంచామని, అవసరమైతే అత్యవసర పరిస్థితుల్లో వాటిని ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో చేపట్టిన జాగ్రత చర్యలపై స్థానిక ప్రజలను చైతన్యవంతం చేసేలా స్థానిక కేబుల్ టీవీ లు, ఇతర ప్రసార మాధ్యమాల ద్వారా తెలియపర్చాలని కలెక్టర్లను ఆదేశించారు. జలపాతాలు, ఇతర పర్యాటక ప్రాంతాలకు ప్రజలు రాకుండా నివారించాలని తెలిపారు. డీజీపీ అంజనీ కుమార్ మాట్లాడుతూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చర్ల ప్రాంతంలోని రెండు గ్రామాల్లో 60 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించామని పేర్కొన్నారు. వికారాబాద్ లోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలను రోడ్లు దెబ్బ తిన్నాయని తెలిపారు. అన్ని ప్రాంతాలలో పోలీస్ అధికారులను అప్రమత్తంగా, క్షేత్ర స్థాయిలో పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశాలు జారీచేశామని వివరించారు.

ప్రభాత జయభేరి jayabheridaily.com

▶▶ మొదటిపేజీ తరువాయి

## రంగంలోకి రెస్క్యూ టీమ్స్

ములుగు జిల్లా వెంకటాపురం మండలం వీరభద్రవరం సమీపంలోని ముత్యంధార జలపాతం వద్ద 84 మంది పర్యాటకుల చిక్కుకున్నారు. ఈ ఘటనపై మంత్రి సత్యవతి రాథోడ్ స్పందించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఫోన్ చేసి పరిస్థితులపై మంత్రి ఆరా తీశారు. వరద ధాటికి అడవిలో చిక్కుకున్న పర్యాటకులను గ్రామానికి చేర్చేందుకు తక్షణమే చర్యలు చేపట్టమని మంత్రి అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో పోలీసులు, రెస్క్యూ టీమ్ లు సంఘటన స్థలానికి చేరుకుని పర్యాటకులను రక్షించేందుకు చర్యలు చేపట్టారు. ముత్యంధార జలపాతం చూసి తిరిగి వస్తుండగా అడవి మధ్యలో ఉన్న వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో వాగు దాటలేక అడవిలో 84 మంది చిక్కుకుపోయారు. ఎప్పటికప్పుడు ఘటనపై సమీక్షిస్తూ అధికారులను అప్రమత్తం చేశారు మంత్రి. ఎవరు ఆందోళన చెందవద్దని పర్యాటకులు సురక్షితంగానే ఉన్నారని ఎన్డీఆర్ఎఫ్ బృందం రక్షణ చర్యలు చేపట్టాయని మంత్రి తెలిపారు.

**ముందు జాగ్రత్త చర్యలపై డీజీపీ ఆదేశాలు**

రాష్ట్రంలో రానున్న రెండు రోజుల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో... రాష్ట్రంలోని పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని డీజీపీ అంజనీ కుమార్ తెలిపారు. రానున్న 48 గంటలలో రాష్టంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో చేపట్టాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో బుధవారం రాత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శాంతి భద్రతల విభాగం అదనపు డీజీ సంజయ్ కుమార్ జైన్ కూడా పాల్గొన్న ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డీజీపీ అంజనీ కుమార్ మాట్లాడుతూ... పోలీస్ యంత్రాంగం 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు. డయల్ 100 కి లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందిన వెంటనే సహాయక చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. గురువారం దాదాపుగా 8 జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది, రెడ్ అలర్ట్ ప్రకటించారన్నారు.

**మరో రెండు రోజులు అతి భారీ వర్షాలు**

రేపు ఈశాన్య, తూర్పు తెలంగాణతో పాటు పశ్చిమ తెలంగాణలోని జిల్లాలకు కూడా రెడ్ అలర్ట్ ఉందని డీజీపీ తెలిపారు. హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అన్నారు. ఇప్పటికే గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల పలు ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు పూర్తిగా నిండాయని, జలాశయాల వద్దకు ఎవరు వెళ్లకుండా తగు ముందు జాగ్రత చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. వరద ఉద్ధృతితో తెగిపోయిన రోడ్లు, ఉద్ధృతంగా ప్రవహించే కాజ్ వేల వద్దకు ప్రజలు వెళ్లకుండా, రెండు దిక్కులా ప్లాస్టిక్ కోన్స్, బారిగేడ్స్, హెచ్చరిక గల ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తగా ట్రాఫిక్ డైవర్షన్ చేయాలని ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చర్లలోని లోతట్టు ప్రాంతాలలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

అత్యవసర పరిస్థితుల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ఉపయోగించుకోవాలని డీజీపీ అంజనీ కుమార్ సూచించారు. రైతులు పొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తగా ఉండాలన్నారు. వర్షాలు పడేటప్పుడు విద్యుత్ స్తంభాలను గాని, వైర్లను గానీ చేతులతో తాకకుండా, ఇతర జాగ్రత చర్యలపై సమాచార మాధ్యమాల ద్వారా ప్రజలను చైతన్య పర్చాలని ఆదేశించారు. వర్షాలకు కల్వర్టు, చిన్న చిన్న బ్రిడ్జిల వద్ద నీరు ప్రవహిస్తున్నప్పుడు వాహనాలతో దాటడానికి సాహసం చేయరాదని సూచించారు. జలపాతాలు, నిండిన చెరువుల వద్దకు ప్రజలు వెళ్లకుండా జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు.

## తెలంగాణలో 40 వేలు, ఏపీలో 30 వేల మంది మహిళలు మిస్సింగ్, కేంద్ర హోంశాఖ ప్రకటన

ఏపీలో మూడేళ్లలో 30 వేల మంది మహిళలు మిస్సైయ్యారని ఇటీవల జనసేనాని పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ మిస్సింగ్ వెనుక కొందరు వాలంటీర్లు ఉన్నారని పవన్ వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. దీంతో వాలంటీర్లు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేశారు. పవన్ కల్యాణ్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఏపీ ప్రభుత్వం కూడా పవన్ పై కేసులు పెట్టేందుకు జీవో కూడా జారీ చేసింది. అయితే రాజ్యసభలో మహిళల మిస్సింగ్ పై ఓ ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రా లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 201922 మధ్య రాష్ట్రాల్లో మిస్సింగ్ కేసులపై సమాచారం ఇచ్చింది. ఏపీలో 20192022 మధ్య ముప్పై వేల మంది బాలికలు, మహిళలు అదృశ్యం అయ్యారని అందులో పేర్కొంది. ఈ లెక్కలు ఏపీ రాజకీయాల్లో మళ్లీ పెద్ద దుమారాన్ని రేపనున్నాయని విశ్లేషకులు అంటున్నారు. వీటిపై ఏపీ ప్రభుత్వం ఎలా స్పందిస్తోందో వేచిచూడాల్సి ఉంది.

**తెలుగు రాష్ట్రాల్లో 72 వేల మంది మిస్సింగ్**

ఏపీలో 2019లో 2186 మంది బాలికలు (18 ఏళ్లు కన్నా తక్కువ వయసున్నవారు), 6252 మంది మహిళలు మిస్సైయ్యారని కేంద్ర హోంశాఖ తెలిపింది. 2020లో 2374 మంది బాలికలు, 7057 మంది మహిళలు, 2021లో 3358 మంది బాలికలు, 8969 మంది మహిళల ఆచూకీ లభించలేదని లెక్కలు చెబుతున్నాయి. మూడేళ్లలో మిస్సైన వారి 30196గా ఉంది. వీరిలో కొంత మంది ఆచూకీ అనంతరం తెలిసిందని కేంద్రహోంశాఖ పేర్కొంది. మూడేళ్లలో దేశం మొత్తం మీద మూడున్నర లక్షల మందికి పైగా బాలికలు, మహిళల ఆచూకీ దొరకలేదని కేంద్ర హోంశాఖ రాజ్యసభకు తెలిపింది. తెలంగాణలో దాదాపుగా 40 వేలకు పైగా మిస్సింగ్ కేసులో నమోదయ్యాయని లెక్కలు చెబుతున్నాయి.

**ఏపీలో మళ్లీ రాజకీయ దుమారం**

మహిళల మిస్సింగ్ పై పవన్ ప్రశ్నించడంతో ఏపీలో రాజకీయం దుమారం చెలరేగింది. మహిళ మిస్సింగ్ కు వాలంటీర్ వ్యవస్థతో లింక్ పెట్టి ఆయన విమర్శలు చేశారు. వాలంటీర్లు సేకరిస్తున్న డేటా కారణంగా హ్యూమన్ ట్రాఫికింగ్ జరిగిందని ఆయన ఆరోపించారు. అయితే కేంద్రం విడుదల చేసిన తాజా లెక్కలతో మిస్సైన మహిళలు 30 వేలకు పైనే ఉన్నారని తెలుస్తోంది. వీరిలో చాలా మంది ఆచూకీ లభించిందని ఏపీ ప్రభుత్వం గతంలో చెప్పింది. కేంద్రం విడుదల చేసిన లెక్కలతో ఈ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. అయితే మహిళల మిస్సింగ్‌కు హ్యూమన్ ట్రాఫికింగ్‌కు సంబంధం లేదని వైసీపీ నేతలు అంటున్నారు. మిస్సింగ్ కేసులతో వాలంటీర్లకు సంబంధంలేదని ప్రభుత్వ వర్గాలు వాదిస్తున్నాయి.

## లోతట్టు ప్రాంతాల ప్రజల తరలింపు

**జయభేరి, వరంగల్ :**

గత 3 రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో... నగరంలోని లోతట్టు ప్రాంతాలను వరంగల్ పోలీస్ కమిష నర్ ఏవీ రంగనాథ్ పోలీస్ అధికారు లతో పరిశీలించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ వరంగల్ హంటర్ రోడ్ లోని ఎన్టీఆర్ కాలనీ, సాయినగర్ కాలనీ, సంతోషమాత కాలనీ బృందా వన్ లలో పూర్తిగా వరద నీరు రావడం తో వరంగల్ పోలీస్ కమిషనర్ స్థానిక పోలీస్ అధికారులతో కల్సి ట్రాక్టర్ లో ప్రయాణించి ప్రస్తుత పరిస్థితులను పరిశీలించారు.కాలనీల్లో వరద నీరు చేరుకోవడంతో ఈ కాలనీల్లో నివాసం వుంటున్న ప్రజలను సురక్షిత ప్రాంతా లను తరలింపు విషయమై పోలీస్ కమిషనర్ వరంగల్ ఏసీపీ బోనాల కిషన్, మట్టేవాడ ఇన్స్ స్పెక్టర్ వెంకటే శ్వర్లు, బీఆర్ఎస్ నాయకుడు గందే నవీన్ ను అడిగి తెలుసుకున్నారు. హంటర్ రోడ్డులోని ఎన్టీఆర్ కాలనీ, సాయినగర్ కాలనీ, సంతోషమాత కాలనీ బృందావన్ లలో పెద్ద స్థాయిలో వరద నీరు చేరుకోవడంతో పోలీస్ కమిషనర్, జిల్లా కలేక్టర్ ఆదేశాల మేరకు మట్టేవాడ పోలీసులు వరంగల్ ఏసీపీ కిషన్, ఇన్స్ స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు, గ్రేటర్ వరంగ ల్ మన్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది సంయుక్తంగా కల్సి లోతట్టు ప్రాంతా ల్లోని ప్రజలను బొట్లు ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

# 29న నగరానికి అమిత్ షా

**జయభేరి, హైదరాబాద్ :**



తెలంగాణలో అధికారమే లక్ష్యంగా బీజేపీ హైకమాండ్ పావులు కదుపుతోంది. రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ చేసిన పొరపాట్లను సరిదిద్దుకుని.. ఎన్నికలకు వెళ్లాలని కమలనాథులు భావిస్తున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గంలో, జిల్లా కమిటీల్లో ఎలాంటి మార్పులు చేయవద్దని పార్టీ రాష్ట్ర సారథి కిషన్ రెడ్డికి పార్టీ హైకమాండ్ సూచించింది. ఎన్నికలను ఎదుర్కొనేందుకు అవసరమైన కమిటీలు వేయాలని భావిస్తున్నారు. ప్రచార కమిటీ, మ్యానిఫేస్టో కమిటీ, సోషల్ మీడియా కమిటీ, ప్రచార సభల కమిటీ ఇలా 22 కమిటీలను త్వరలోనే ప్రకటించనున్నారు. పోటీ ఎక్కువగా లేని నియోజకవర్గాల్లో ఎన్నికల పనులు ప్రారంభించుకోవాలని ఇప్పటికే సంకేతాలిచ్చారు. ఈ నెల 29న ఖమ్మంలో అమిత్ షాతో భారీ బహిరంగసభకు ముందుగా ప్లాన్ చేసుకున్నారు.భారీ వర్షాల కారణంగా ఖమ్మం సభను వాయిదా వేశారు. అందుకు బదులుగా హైదరాబాద్ లో అమిత్ షా సామాజిక వర్గాల ప్రముఖులతో భేటీ కానున్నారు. పార్టీ ముఖ్య నేతలతో సమావేశం కానున్నారు. ఇటీవల బీజేపీ నేతలు తమ మధ్య ఉన్న లుకలుకలు బయటపెట్టుకోవడం పార్టీకి ఇబ్బందికరంగా మారాయి. పార్టీని లైన్లో పెట్టడమే ప్రధాన లక్ష్యంగా అమిత్ షా హైదరాబాద్ రానున్నారని సమాచారం. తెలంగాణలో బీఆర్ఎస్ ను ఢీకొట్టడానికి అవసరమైన వనరులు ఏంటీ ? హైకమాండ్ నుంచి ఎలాంటి సహకారం అవసరం ? ఎంత వరకు పార్టీ అధిష్టానం సహాయం చేయగలదు ? ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు ఎలా ఉండాలి ? ఇలాంటి అంశాలపై అమిత్ షా క్లారిటీ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.తాజాగా కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ భేటీ కావడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో పార్టీ పరిస్థితులపై అమిత్ షాతో చర్చించిన బండి సంజయ్ కు హైకమాండ్ నుంచి మంచి భరోసానే లభించినట్లు ప్రచారం జరుగుతోంది. మొత్తానికి అమిత్ షా పర్యటనతో తెలంగాణ బీజేపీలో లుకలుకలు ఏ మేరకు సర్దుకుంటాయో చూడాలి.

**బయిట పడుతున్న లుకలుకలు**

గొడవలు, ఆధిపత్య పోరు, నేతల సూటిపోటి మాటలు, అసంతృప్తి ట్వీట్‌స్‌కు కేరాఫ్‌గా మారిపోతోంది తెలంగాణ బీజేపీ. రాష్ట్ర పార్టీ కొత్త అధ్యక్షుడి ప్రమాణస్వీకార కార్యక్రమం సాక్షిగా ... మరోసారి పార్టీలోని లుకలుకలు బయటపడ్డాయి. ఈ సందర్భంగా నాయకులు ఇన్‌డైరెక్ట్‌గా, డైరెక్ట్‌గా వేసిన పంచ్‌లు, చేసిన కామెంట్స్ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అయ్యాయి. ఇది చూసిన వారంతా... అబ్బో... తెలంగాణ బీజేపీలో చాలా గొప్ప ఐకమత్యం ఉందే... సూపర్.... అంటున్నారట. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా నాలుగోసారి బాధ్యతలు తీసుకున్నారు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి. అయితే ఈసారి మాత్రం గతానికి భిన్నంగా జరిగిందట కార్యక్రమం. ప్రమాణ స్వీకార సభ మొదట్నుంచి చివరిదాకా హాట్ హాట్‌గా జరిగింది. నేతలు గతంలోలాగా లోలోపల ఏం దాచుకోకుండా... తమ మనసులో ఉన్న మాటలు ఓపెన్‌గానే చెప్పేశారట. ఆ క్రమంలో కొందరు పార్టీ లైన్ దాటారన్న అభిప్రాయాలు సైతం ఉన్నాయి. అంతర్గత వేదికలపై మాట్లాడాల్సిన విషయాలను కూడా బహిరంగంగానే మాట్లాడి కాక పెంచారన్న అభిప్రాయం వ్యక్తమవుతోందట.మాజీ అధ్యక్షుడు బండి సంజయ్‌ని ఆకాశానికెత్తేశారు కోమటి రెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి. అదీ కూడా అలా ఇలా కాదు...భుజాల మీదెక్కించుకుని పైకెత్తి నెలబెట్టేశారంతే.... అంటున్నాయి పార్టీ వర్గాలు. బండి సంజయ్‌ని చూసి బాత్ రూంలోకి వెళ్లి ఏడ్చానని అన్నారు రాజగోపాల్‌రెడ్డి. అసలు సంజయ్ పదవి పోవడానికి రాజ్ గోపాల్ కూడా ఒక కారణమని ప్రచారం జరుగుతున్న పరిస్థితుల్లో అయన చేసిన ఈ కామెంట్స్ చర్చనీయాంశం అయ్యాయి. ఇక ఈడీని కూడా కేసీఆర్ మేనేజ్ చేశారన్న వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. మరో మాజీ మంత్రి రవీంద్ర నాయక్ కూడా ప్రధానిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. నేతలకు వేదిక మీద మైకిచ్చి మాట్లాడమంటే.... అసలు విషయానికి బదులు ఏవేవో మాట్లాడేసి లేని పోని వివాదాలు కొని తెచ్చారన్న అభిప్రాయం ఉందట పార్టీ పెద్దల్లో. ఇక బండి సంజయ్ మాటలపై ఇంటా బయటా రచ్చ అవుతోంది. తన మీద సొంత పార్టీలోనే కొందరు హైకమాండ్‌కు ఫిర్యాదులు చేశారని, అలాంటి పనులు మానుకోండని అన్నారాయన. దీంతో సంజయ్ ఎవర్ని ఉద్దేశించి ఆ మాటలన్నారన్న అంశం ఆసక్తికరంగా మారింది. కనీసం కిషన్‌రెడ్డిని అయినా... స్వేచ్ఛగా పనిచేసుకోన్వండని అన్న మాటలపై పార్టీలోని కొందరు నేతలు గుర్రుగా ఉన్నట్టు తెలిసింది. ఇటీవలి పరిణామాలను ఉద్దేశించే ఆయన అలా అనిఉంటారని గుసగుసలాడుకుంటున్నాయి పార్టీ వర్గాలు.మరోవైపు మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డిని కార్యక్రమానికి పిలవడంపై కూడా పార్టీలో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోందట. పచ్చి సమైక్యవాది అయిన కిరణ్‌ను ఎలా పిలిచారంటూ కొందరు తీవ్రంగా వ్యతిరేకించినట్టు తెలిసింది. విజయశాంతి అయితే ఏకంగా ట్వీట్ ఏ చేశారు. ఆయన వచ్చినందుకే నేను మధ్యలో వెళ్లిపోయానంటూ రాములమ్మ చేసిన ట్వీట్ కలకలం రేపుతోంది. ఈ పరిణాలన్నిటినీ చూస్తున్నవారు మాత్రం బీజేపీలో కూడా కాంగ్రెస్ కల్చర్ మొదలైందని అంటున్నారట. ఓ వైపు పార్టీ హైకమాండ్ సర్ది చెప్పే పని చేస్తుంటే... మరోవైపు ఎవరో ఒకరు గీత దాటి తల నొప్పి తెప్పిస్తున్నారన్నది ఇప్పుడు టీ బీజేపీలో ఉన్న అభిప్రాయం. ఈ లొల్లి ఇలానే కొనసాగితే ఎన్నికల్ని ఎదుర్కోవడం ఎలాగన్న ఆందోళన కేడర్‌లో పెరుగుతోందట.

# కిషన్ రెడ్డా.. కొత్త సీఎం..?

**జయభేరి, నిజామాబాద్ :**



ధర్మపురి అరవింద్ వాక్చాతుర్యంతో బిజేపి క్యాడర్ లో కొత్త జోష్ ని నింపారా? చెప్పకనే తమ పార్టీ సిఎం అభ్యర్థి ఎవరని హింట్ ఇచ్చారా? బండి సంజయ్ ని అధ్యక్ష పదవి మారిన రోజునుంచి ధర్మపురి అరవింద్ లో ఫుల్ స్వింగ్ లో కనిపిస్తున్నారు. అరవింద్ ప్రవర్తనని చూసి అందరూ అతను పార్టీ మారిపోతున్నడెమో అన్న సందేహాలు వ్యక్తం చేశారు. దాదాపు నాలుగు ఐదు నెలల పాటు వాళ్ళిద్దరి మధ్య కోల్డ్ వార్ సిట్యుయేషన్ కనిపించింది. నిజామాబాద్ జిల్లాలో పలు నియోజకవర్గాలలో పలు టికెట్స్ విషయంలో అరవింద్ కి బండి సంజయ్ కి అభిప్రాయ బేధాలు ఏర్పడ్డాయని పార్టీ వర్గాలలో చర్చలు జరిగాయి. తాను కేవలం అధ్యక్షుడు మాత్రమే. టికెట్స్ విషయంలో తనకు అధికారం లేదంటూ సంజయ్ అరవింద్ డిమాండ్ ను సున్నితంగా తిరస్కరించారని చెప్పుకున్నారు. కానీ పార్టీ లో సంజయ్ పెత్తనం ఏ మాత్రం ఉందో తెలిసిన అరవింద్.. సంజయ్ కావాలనే తన కోరికను అవాయిడ్ చేస్తున్నాడని అనుకుని సంజయ్ కి దూరం అయ్యారని కూడా చెప్పుకున్నారు. ఈ విషయం లో నిజానిజాలు ఎలా ఉన్నా.. అధ్యక్షుడిగా సంజయ్ ని మార్చగానే మొట్ట మొదట ప్రెస్ మీట్ పెట్టి హడావిడి చేశారు అరవింద్. ఢిల్లీ లో కిషన్ రెడ్డి ని తెలంగాణ బిజెపి అధ్యక్షుడిగా అనౌన్స్ చేసిన కొద్ది సేపటికే అరవింద్ ధరపురి హైదరాబాద్ స్టేట్ ఆఫీస్ లో ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి కిషన్ రెడ్డి ని పొగడ్తలతో ముంచెత్తారు. కిషన్ రెడ్డి సౌమ్యుడు, చదువుకున్నవాడు. అందరినీ కలుపుకుని పోయేవాడు అంటూ అరవింద్ ధర్మపురి స్టేట్మెంట్స్ చేశారు. ప్రెస్ మీట్ లో అరవింద్ ప్రదర్శించిన తీరు, పలికిన మాటలు.. సంజయ్ పై తనకున్న అభిప్రాయాన్ని ఇండైరెక్ట్ గా చెప్పకనే చెప్పారు అనిపించాయి. బండి సంజయ్ వ్యవహార శైలి, కిషన్ రెడ్డి వ్యవహార శైలీలను పరోక్షంగా తెలిపే ప్రయత్నం అరవింద్ చేశారు అనిపించింది. అధ్యక్షుడిగా ఉంటూ తానే సిఎం రేస్ లో ఉన్నాడని భావించిన సంజయ్ ను మాటల సురుకులతో అరవింద్ గేలి చేశారు అనిపించింది. సీఎం కేసీఆర్ విషయం లో కూడా.. రఘునందన రావు, ఈటల రాజేందర్ ల మాదిరి సౌమ్యంగా తను మాట్లాడలేనని అరవింద్ చెప్పారు. నిన్న స్టేట్ ఆఫీస్ లో జరిగిన ఓ కార్యక్రమంలో అరవింద్ ధర్మపురి సీఎం కేసీఆర్ ను ఎద్దేవా చేస్తూ.. అతని భాషలోనే అతనికి కౌంటర్ ఇస్తాను అన్నారు. వచ్చే ఎన్నికలలో ప్రధాని నరేంద్ర మోడి నేతృత్వంలో కిషన్ రెడ్డి అధ్యక్షతన బిజేపి నేత.. తెలంగాణ కు సీఎం గా ప్రమాణ స్వీకారం చేస్తారు అంటూ అరవింద్ చెప్పారు. కిషన్ రెడ్డి అధ్యక్షతన ప్రమాణస్వీకారం జరుగుతుంది అన్న మాటల వెనక ఈటలను ఇండైరెక్ట్ గా తమ పార్టీ తెలంగాణ అభ్యర్థి అంటూ అరవింద్ హిట్ ఇచ్చారనే అనిపిస్తోంది. వేతకబోయిన తీగ కాలికి తగిలినట్టు.. బీఆర్ఎస్ నుంచి బయటికి నెట్టివేయబడ్డ రాజేందర్ బిజేపిని ఆశ్రయించడం జరిగింది. రాజేందర్ బిజేపి లో చేరిన తొలినాళ్ళలో స్టేట్ బిజేపి, పార్టీ క్యాడర్ లో ఎన్నడూలేని ఓ సరికొత్త జోష్ కనిపించింది. హుజూరాబాద్ ఎన్నికల తర్వాత అంతర్గత వైషమ్యాల వల్ల రాజేందర్ వెనకబడ్డారు. దాదాపు ఏడాదిన్నర సస్పెన్స్ తర్వాత ఈటలకు మళ్ళీ మంచి రోజులు వచ్చాయి అనిపిస్తోంది. కేసీఆర్ ను ఓడించడమే జీవిత ధ్యేయంగా పెట్టుకున్న ఈతలకు గడిచిన కొన్ని నెలలు అసంతృప్తితో సాగాయి. ఈటల గ్యాంగ్ మొత్తం. అరవింద్ పరోక్షంగా పేర్కొన్నట్టు, కేంద్ర బిజేపి ఎప్పటినుంచో ఎదురు చూసిన బిసి వర్గానికి చెందిన వ్యక్తి అయినందుకు గాను.. ఈటలనే తెలంగాణ బిజేపి ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటింపబడతారా అనేది చాలా మంది ఎదురుచూస్తున్న అంశం.

# భారీగా పడిపోయిన చికెన్ ధరలు

**జయభేరి, హైదరాబాద్ :**

నాన్ వెజ్ ప్రియులకు గుడ్ న్యూస్. నిన్న,మొన్న దాకా నోర్లు కట్టేసుకునేలా చుక్కలు చూపించిన చికెన్ రేట్లు క్రమంగా తగ్గుముఖం పట్టాయి. రెండు మూడు నెలల నుంచి చికెట్లు అమాంతం ఆకాశాన్ని అంటాయి. సామాన్యుడు కొనలేని పరిస్థితి ఉండేది. పెరిగిన రేట్లకు భయపడి వాటికి దూరంగా ఉంటూ వచ్చారు. అలాంటి వారికి గుడ్ న్యూస్. హైదరాబాద్ నగరంలో చికెన్ రేట్లు భారీగా తగ్గాయి. అయితే వర్షాల నేపథ్యంలో చికెన్ రేట్లు పడిపోయాయి. వాతావరణంలో మార్పులతో హైదరాబాద్ నగరంలో చికెన్ ధరలు భారీగా తగ్గాయి. టమాటా ధరలు పెరుగుదలతో ఆందోళన చెందుతున్న ప్రజలకు చికెన్ ధరలు తగ్గడం ఉపశమనం కలిస్తోంది. కిలో రూ. 125కు చికెన్ రేటు పడిపోయింది.ఫారాలల్లో కోళ్ల మరణాలు ఎక్కువగా ఉండడం, వేసవి కాలం ముగియడం ప్రధాన కారణంగా తెలుస్తోంది. వచ్చే నెల నుంచి పెళ్లిళ్లు, ఫంక్షలు ఉండడంతో వ్యాపారాలు పడిపోయాయని, ఫలితంగా ధరలు తగ్గినట్లు వ్యాపారులు చెబుతున్నారు. గత నెల వరకు కిలో లైవ్ చికెన్ రూ. 160 నుంచి రూ. 170 ఉండేది. కిలో మాంసం రూ. 280 నుంచి రూ. 320 వరకు పలికింది. అయితే ఇప్పుడు కిలో లైవ్ రూ. 125, మాంసం రూ. రిటైల్ షాపుల్లో కిలో రూ.200 ఉంటోంది. బల్‌క్‌గా తీసుకునే వారికి ధరలు మరింత తగ్గనున్నాయి. శ్రావణ మాసం ప్రారంభమైతే చికెన్ ధరలు మరింత తగ్గనున్నాయి. శ్రావణ మాసంలో చాలా మంది మాంసాహారం ముట్టకపోటంతో చికెన్‌కు డిమాండ్ తగ్గే అవకాశం ఉంది. దీంతో ధరలు అమాంతం తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రస్తుతం కూరగాయులు ధరలు ఆకాశన్నంటిన తరుణంలో చికెన్ ధరలు తగ్గటం ఊరటనిచ్చే అంశమే. ప్రస్తుతం కిలో టమాటా రూ. 100 నుంచి 150 పైగా పలుకుతోంది. కేజీ కేజీ టమాట ధరకు కేజీ చికెన్ వస్తుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.రానున్న రోజుల్లో ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని పలువురు వ్యాపారులు తెలిపారు. కిలో రూ. 90 కంటే తక్కువకే విక్రయించే అవకాశం ఉందని చెప్పారు. తెలంగాణలో నాన్ వెజ్ ప్రియులు ఎక్కవ. కేజీ టమాటా కొనలేని వారు ఇప్పుడు కేజీ చికెన్ కొని హ్యాపీగా లాగించేయొచ్చు. హైదరాబాద్‌కు కోళ్లు ప్రధానంగా శంషాబాద్, షాద్‌నగర్, కందుకూరు, కొత్తూరు, ఇబ్రహీంపట్నం, మేడ్చల్, రంగారెడ్డి, హయత్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి కోళ్ల సరఫరా జరుగుతుంది.





## గేదెలకు ఆక్సీటోన్

**జయభేరి, హైదరాబాద్ :**

ఇన్నాళ్లు మనం కెమికల్స్ కలిపి తయారు చేసే కల్తీ పాల గురించి విన్నాం. పాలల్లో నీళ్లు కలిపే మాయగాళ్లను కూడా చూశాం. కానీ ఇక్కడ మహా దారుణం. గేదెలు ఎక్కువగా పాలు ఇచ్చేందుకు వాటికి ఆక్సిటోసిన్ డ్రగ్ ఇస్తున్నారు. పక్కా సమాచారం మేరకు రాజేంద్రనగర్ SOT పోలీసుల మైలార్‌దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధి రోషన్ కాలనీలోని జాఫర్ డైరీ ఫామ్ డైరీ ఫామ్‌లో సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలోనే అక్కడ 48 ఆక్సిటోషిన్ డ్రగ్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. 7 నెలల నుంచి 3 ఏళ్ల మధ్య పిల్లలకు పోషకాహారం కోసం ప్రభుత్వం అందించే 200 కిలోల బాలామృతం కూడా అక్కడ స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వం పిల్లల కోసం ఉచితంగా ఈ బాలామృతం ఇంత పెద్ద మోతాదులో వీరి వద్దకు ఎలా వచ్చిందోనని అధికారులు ఎంక్వైరీ చేస్తున్నారు. ఆ పిండిని సైతం పశువులకు దాణాగా వేస్తున్నట్లు గుర్తించారు.గేదెలు అధికంగా పాలు ఇచ్చేందుకు అక్రమంగా కొందరు ఆక్సిటోసిన్ డ్రగ్స్ వినియోగిస్తారు. కానీ ఇలా చెయ్యడం వల్ల అటు పశువుల ఆరోగ్యం దెబ్బతింటుంది. ఆ పాలు తాగినవారిని కూడా అనారోగ్యం చుట్టుముడుతుంది. అందుకే ఈ డ్రగ్స్‌పై ప్రభుత్వం నిషేధం విధించింది. అయినా అక్రమంగా కొందరు ఈ తంతు కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

# రైతుల వద్దకు కమలం ప్లాన్



**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ బీజేపీ కొత్త అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన కిషన్ రెడ్డి పార్టీని క్షేత్ర స్థాయిలో యాక్టివేట్ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా ఇప్పటికే డబుల్ బెడ్ రూం ఇళ్లపై పోరాటం చేస్తున్నారు. తాజాగా 'రైతు వద్దకు బీజేపీ' కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. గురువారం నుంచే ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లుగా కిషన్ రెడ్డి ప్రకటించారు . హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన వ్యవసాయ పద్ధతులపై అవగాహనతో పాటు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను రైతులకు వివరిస్తామని తెలిపారు. 2.8 కోట్ల దుకాణాలను కిసాన్ సమృద్ధి కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తామని వివరించారు. వీటిలో తొలిదశలో గురువారం 1.25 లక్షల దుకాణాలను ప్రధాని ప్రారంభిస్తారని పేర్కొన్నారు.కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం ఒక్కటే అన్నారు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి. ఈ రెండు పార్టీలు గతంలో కలిసి గతంలో కలిసి పని చేశాయి..పోటీ కూడా చేశాయని చెప్పారు. కాంగ్రెస్ కు ఓటు వేస్తే బీఆర్ఎస్, ఎంఐఎంకు ఓటు వేసినట్లేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం లోపాయికారీ ఒప్పందాన్ని తెలంగాణ సమాజం అర్థం చేసుకోవాలని కోరారు. కేంద్రంపై అవిశ్వాసం తీర్మానంతో ఒరిగేది ఏమీలేదని కొట్టిపారేశారు. బీజేపీ మాత్రమే బీఆర్ఎస్ తో పోరాటం చేస్తోందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎంలు అవినీతి, కుటుంబ పార్టీలేనని ఆరోపించారు. ప్రత్యక్షంగా.. పరోక్షంగా మూడు పార్టీలు అనేక సార్లు తెలంగాణను పరిపాలించాయని చెప్పారు. బీఆర్ఎస్ కారు స్టీరింగ్ ఎంఐఎం దగ్గర ఉందని.. తెలంగాణలో మార్పు రావాలంటే బీజేపీనే సాధ్యమన్నారు కిషన్ రెడ్డి. ఈనెల 29న హైదరాబాద్ అమిషా రానున్నారు. టీబీజేపీలో కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే రఘునందన్ లకు కీలకబాధ్యతలను అప్పగించనున్నట్లుగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణలో అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతోన్న హైకమాండ్...ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ స్పీడ్ పెంచింది. ఈ మేరకు పలు కీలక నిర్ణయాలు తీసుకుంటుంది. అమిత్ షా పర్యటనకు సంబంధించి రాష్ట్ర బీజేపీ అన్ని రకాల సన్నాహాలు చేస్తోంది. బండిను పార్టీ అధ్యక్షుడి స్థానం తొలగించడం.. కిషన్ రెడ్డిని ఆ పదవిలో నియమించడం పార్టీ నేతల్లో సమన్వయం లోపం.. వీటన్నింటిని బీజేపీ సరిదిద్దే పనిలో పడింది.స్టేట్ చీఫ్ గా బాధ్యతలు స్వీకరించిన కిషన్ రెడ్డి.. చాలా బిజీగా మారారు. 29న తేదీని అమిత్ షా పర్యటన నేపథ్యంలో పలు ప్రతినిధులో భేటీ కానున్నారు. రాష్ట్ర కార్యాలయంలో వార్ రూం ఏర్పాటుకు కసరత్తులు ప్రారంభించారు. అయితే వార్ రూం ఇంచార్జ్‌గా ఎవరిని పెడతారన్న దానిపై కూడా చర్చ జరగనుంది. ఈ పరిణామాల నేపథ్యంలో సోషల్ మీడియా బాధ్యతలను అర్వింద్, రఘునందన్ లకు అప్పగిస్తున్నట్లు సమాచారం. ఇది ఇంకా అధికారికంగా వెలువడలేదు. కొన్ని రోజులుగా బీజేపీ హైకమాండ్ పై రఘునందన్ రావు ఘాటు వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.



## అంగన్ వాడీ కేంద్రంలో పాఠ్య పుస్తకాలను ఆవిష్కరించిన

### పాఠ్య పుస్తకాలను ఆవిష్కరించిన కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ

**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ జిల్లా కేంద్రంలోని మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డులో గల అంగన్ వాడీ కేంద్రంలో పేద బడుగు బలహీన వర్గాల కోసం చిన్న పిల్లలు 3 నుండి 4 సంవత్సరాల పిల్లలకు ఎల్ కే జి, 4 నుండి 5 సంవత్సరాల పిల్లలకు యు కే జి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తునటువంటి మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకము పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమం పుస్తకాలను మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డు పరిధిలో గల అంగన్ వాడీ కేంద్రంలో పాఠ్య పుస్తకాలను ఆవిష్కరించిన కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ. ఈ సందర్భంగా కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ఏర్పడినప్పటి నుండి మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కే సి ఆర్ కిట్, అమ్మ ఒడి, కే సి ఆర్ న్యూట్రిషన్ కిట్లు, ఆరోగ్య లక్ష్మీ లాంటి విప్లవాత్మక పథకాలను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు, తెలంగాణ రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు, తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపికా నర్సింహ్మా రెడ్డి ఆధ్వర్యంలో 23వ వార్డును అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానని నా పైన నమ్మకంతో నాకు ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు ఎళ్ళవేలలా అందుబాటులో ఉంటానని వార్డులో ఏ సమస్య ఉన్నా నా దృష్టికి తీసుకువస్తే ప్రతి సమస్యను పరిష్కరిస్తానని తెలియజేసిన కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్ ఇందిరమ్మ, అయా మణెమ్మ, నర్సు సంధ్యారాణి, ఆశా వర్కర్లు సునీత, వసంత, లక్ష్మీ, బాలింతలు, గర్భిణీ స్త్రీలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం మున్నేరు ప్రవాహం.. పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉంది

### ప్రజలు ఆందోళన చెందవద్దు.. అధికారులందరూ కార్యస్థానాల్లో అందుబాటులో ఉండాలి

### క్షేత్రస్థాయిలో పర్యటించి పక్కాగా వాస్తవ పరిస్థితిని అంచనా వేయాలని అధికారులకు మంత్రి పువ్వాడ ఆదేశాలు

**జయభేరి, ఖమ్మం :**

గత నాలుగైదు రోజుల నుండి ఏకధాటిగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం యావత్తు అప్రమత్తంగా ఉందని, పరిస్థితి పూర్తిగా అదుపులో ఉన్నందున ప్రజలు ఎలాంటి ఆందోళనకు లోనుకావద్దని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సూచించారు. వర్షాల వల్ల ఎలాంటి పరిస్థితి ఉత్పన్నమైనా, సమర్థవంతంగా ఎదుర్కొనేలా అన్ని శాఖల అధికారులు, సిబ్బందిని సమాయత్తం చేశామని, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది అందరూ తమ తమ కార్యస్థానాల్లోనే అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని, ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని మంత్రి పువ్వాడ ఆదేశించారు. ప్రస్తుత సమయంలో ఎవరు కూడా సెలవుల్లో వెళ్లకుండా, పూర్తి అప్రమత్తతో విధులు నిర్వర్తించేలా జిల్లా కలెక్టర్ కు సూచించారు. జిల్లా వ్యాప్తంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపడుతున్న సహాయక చర్యల గురించి జిల్లా కలెక్టర్ వి పి గౌతం ను ఆరా తీస్తూ, యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టాలని ఆదేశించారు. రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి పక్కాగా వాస్తవ పరిస్థితిని అంచనా వేయాలని, అనవసరంగా ప్రజలను భయాందోళనలకు గురిచేసేలా వ్యవహరించకూడదని హితవు పలికారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, వరద ప్రభావంతో వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగానే అప్ర



మత్తతో కూడిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని పీ.హెచ్.సీలలో 24 గంటల పాటు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా, అన్ని రకాల మందుల నిల్వలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పారిశుధ్యంపై దృష్టి సారిస్తూ, ఆశా వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు సమర్థవంతంగా ప్రజలకు సేవలందించేలా అప్రమత్తం చేయాలన్నారు. కలెక్టరేట్, రెవెన్యూ డివిజనల్, మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ లకు వర్ష ప్రభావిత ప్రాంతాల నుండి ఏదైనా సమాచారం అందిన వెంటనే సహాయక చర్యలు చేపట్టేలా సిబ్బందిని సమాయత్తపర్చాలని మంత్రి అధికారులకు హితవు పలికారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తతతో కూడిన చర్యలు సమర్థవంతంగా చేపడుతోందని, మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ తమ తమ కార్యస్థానంలోనే ఉంటూ పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. ముఖ్యంగా పురాతన కాలం నాటి ఇండ్లలో ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, వారికి భోజన వసతి, ఇతర సదుపాయాలు కల్పించాలని మంత్రి సూచించారు. ఎటువంటి విపత్కర పరిస్థితులు తలెత్తినా వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రజలు కూడా తమ వంతు జాగ్రత్తలు పాటిస్తూ ఎలాంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం సంభవించకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రభుత్వ సలహాలు సూచనలు పాటించాలన్నారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో ఎవరైనా ఎక్కడైనా ప్రమాదంలో చిక్కుకుంటే తక్షణమే మున్సిపల్ కార్పొరేషన్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెం.7901298265, 9866492029 కు సమాచారం అందించాలని సూచించారు.



## బిఆర్ఎస్ నాయకుల మాటలు బూటకం

**జయభేరి, మేడిపల్లి :**

ఉప్పల్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులలో జిహెచ్ఎంసి రాష్ట్ర ప్రభుత్వ సహాయ నిరాకరణ వల్ల జరుగుతున్నటువంటి జాప్యం పైన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఉప్పల్ మాజీ శాసనసభ్యుడు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్, కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడికరి దృష్టికి తీసుకువెళ్లి యుద్ధ ప్రాతిపదిక మీద రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరిన పిమ్మట ఒక కోటి 69 లక్షల 17 వేల రూపాయలను 24 జులై నాడు మంజూరు చేసి... ఈనెల 28న పనులు ప్రారంభించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి సంబంధిత అధికారులని ఆదేశించారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర ఆర్ అండ్ బి మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ముఖ్యమంత్రి మేమే రోడ్డు వేస్తాం కేంద్రం వేయడం లేదు అన్నట్టుగా మళ్లీ కపట నాటకానికి తెరదించారు... ఆ రకంగా ప్రకటన విడుదల చేశారు. ఈ రహదారి నిర్మాణానికి సంబంధించిన నిధులు విడుదల చేసిన జీవో కాపీని పీర్జాదిగూడ కార్పొరేషన్ లో జాతీయ రహదారిపై ఉన్న ఫ్లైఓవర్ వద్ద కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన కాపీని చూపిస్తూ ఈ భూటాకు మాటలు ఆపాలంటూ బిఆర్ఎస్ నాయకుల దొంగ మాటలను ఖండించిన జిల్లా అధ్యక్షుడు పటోళ్ల విక్రం రెడ్డి, సీనియర్ నాయకులు కొంపెల్లి మోహన్ రెడ్డి, ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు బుద్ధి శ్రీనివాస్, శ్యాంసుందర్, పిర్జాదిగూడ కార్పొరేషన్ అధ్యక్షుడు నమిలికొండ అనిల్ రెడ్డి, వందర్ పవన్ రెడ్డి, జైపాల్ రెడ్డి, శాడాగొండ కర్ణాకర్ రెడ్డి, గీతారాం, రాణి సుధాకర్, సుజాత నాయుడు, పల్లె బాలరాజు గౌడ్, ఏనుగు రాజశేఖర్ రెడ్డి, రమేష్ చారి, రాముయాదవ్, మెట్టు మహేందర్ రెడ్డి, మావిడి వెంకటేష్, వాసుదేవ్ రెడ్డి, కమలాకర్, గిరి గౌడ్, స్వరూప్ చంద్ర, మన్నే గిరిబాబు రజిని రెడ్డి, నవనీత, బాల్ రెడ్డి, మోహన్ యాదవ్, ప్రభాకర్ రెడ్డి, మాధవి సుగుణా రెడ్డి తదితరులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వర్షంలోనే.. సాగిన పాదయాత్ర



**జయభేరి, ఉప్పల్ :**

రామంతపూర్ డివిజన్ పరిధిలోని రామంతపూర్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, నెహ్రూ నగర్, ప్రిన్స్ స్టాన్ కాలేజ్ లైన్, శారద నగర్, ఆర్టీసీ కాలనీ, ఎండోమెంట్ కాలనీ, ఓల్డ్ రామంతపూర్, కృష్ణ హోటల్ చౌరస్తా , భరత్ నగర్, బస్తీలలో... ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి పాదయాత్ర 17వ రోజు వర్షంలోనే కొనసాగింది. స్థానిక ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, సంక్షేమ పథకాల అమలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనుల వివరాలను తెలుసుకుంటూ... ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి కాలనీలో పర్యటించారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను, నిలిచిపోయిన అభివృద్ధి పనులను... ఆయా సంబంధిత విభాగాల అధికారులతో మాట్లాడి వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. పాదయాత్రలో ముఖ్యంగా నెహ్రూ నగర్ లో రోడ్ల పైన వేసిన చెట్టు కొమ్మలను తీసివేయాలని పారిశుద్ధ నిర్వహణ చేయాలని,ఓల్డ్ రామంతపూర్ లో డ్రైనేజీ, సిసి రోడ్లు వేయించాలని, మ్యాన్ హోల్స్ పై మూతలు వేయించాలని, పారిశుధ్య నిర్వహణ చేయించాలని, భరత్ నగర్ లో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు పక్కకు జరిపి ఏర్పాటు చేయాలని, వంగిపోయిన విద్యుత్ స్తంభాలను ఆధునికరించాలని, భరత్ నగర్ కమ్యూనిటీ హాల్ కు జాలి ఫెన్సింగ్ వేయించాలని, సిసి రోడ్లు వేయించాలని స్థానికుల నుంచి వచ్చిన విన్నపాలను జాప్యం చేయకుండా వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ పాదయాత్రలో కార్పొరేటర్ జేరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ ధనపాల్ రెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర రెడ్డి, గడ్డం రవికుమార్, గరిక సుధాకర్, లేతాకుల రఘుపతి రెడ్డి, కాటిపల్లి రవీందర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, రామంతపూర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు .

# ఆయిల్ పామ్ సాగు లక్ష్యాలను పూర్తి చేయాలి

**జయభేరి, పెద్దపల్లి :**

జిల్లాలో ఆయిల్ పామ్ లక్ష్యాలను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో క్లస్టర్, డివిజన్ వారీగా సాగు చేస్తున్న ఆయిల్ పామ్ పంటల సాగు, రైతు వేదికల వినియోగంపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ రైతులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తూ వారి అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నదని, ఆయిల్ పామ్ సాగు ఎంతో లాభదాయకం అని, రైతులు ప్రత్యామ్నాయ పంట క్రింద ఆయిల్ పామ్ సాగు చేయాలని అన్నారు.ఆయిల్ పామ్ సాగు ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుందని, ప్రతి 15 రోజులకు ఒకసారి ఆయిల్ పామ్ సాగు పై విస్తృత సమావేశం నిర్వహించడం జరుగుతుం దని, వచ్చే రివ్యూ సమావేశం నాటికి ప్రతి క్లస్టర్లో 10 ఎకరాలకు పైగా ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ పూర్తి చేయాలని లేనిపక్షంలో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

వ్యవసాయ క్లస్టర్ పరిధిలో ఉన్న 5 ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న పెద్ద రైతులను, ప్రజా ప్రతినిధులను లక్ష్యంగా చేసుకుని ఆయిల్ పామ్ సాగు వల్ల కలిగే విస్తృత ప్రయోజనాలను వివరిస్తూ ప్రణాళిక బద్ధంగా లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రైతులకు ఆయిల్ పామ్ సాగు వల్ల మొదటి మూడు సంవత్సరాల అంతర్ పంటల సాగుతో ఆదాయం పొందవచ్చని, మూడవ సంవత్సరం నుంచి లక్ష వరకు ఎకరానికి ఆదాయం సమకూరుతుందని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రతి ఎకరం ఆయిల్ పామ్ సాగు లో మొక్కలు నాటేందుకు, డ్రిప్ ఇరిగేషన్ కు ప్రభుత్వం అందించే సబ్సిడీ, వీటికి అదనంగా మొదటి నాలుగు సంవత్సరాలు ఆయిల్ పామ్ సాగు చేసే ప్రతి ఎకరానికి అందించే 4 వేల 200 రూపాయల ప్రోత్సాహకం గురించి రైతులకు వివరించాలని కలెక్టర్ తెలిపారు. రైతు వేదిక పరిధిలోని క్లస్టర్ పరిధిలో ఆధునిక పద్ధతులను వినియోగిస్తూ మంచి లాభాలు ఆర్జించిన రైతుల వివరాలు ఫోటోలతో పెట్టాలని కలెక్టర్ తెలిపారు. రైతు వేదికలో వ్యవసాయ విస్తరణ అధికారులు అందుబాటులో ఉన్న, ఉండే సమయాన్ని వివరిస్తూ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రతిరోజు కొంత సమయం అందుబాటులో ఉండి రైతులతో చర్చించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి శుక్రవారం రైతు వేదికలో తప్పనిసరిగా రైతులతో ఆధునిక సాగు పద్ధతులు, వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించా లని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశాలకు మండల వ్యవసాయ అధికారులు మండల ప్రత్యేక అధికారులు, వ్యవసాయ శాఖ ఏడిలు హాజరుకావాలని అన్నారు. రైతు వేదికలలో ప్లాస్టిక్ ఫ్లెక్సీలు నివారించాలని, బ్లాక్ బోర్డ్ ఏర్పాటు చేసి కలర్ చాకులతో వివరాలు ప్రదర్శించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జగన్ మోహన్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, పెద్దపల్లి హార్టికల్చర్ అధికారి ఏ.జ్యోతి, రామగుండం, మంథని హార్టికల్చర్ అధికారి జె.శ్రీకాంత్, వ్యవసాయ శాఖ ఏ.డి.ఏ.లు, మండల వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ఉప్పల్ రింగ్ రోడ్ రహదారిపై ఉన్న వర్షపు నీటిని తొలగింపు

**జయభేరి, కాప్రా :**

ఉప్పల్ రింగ్ రోడ్ నుండి వరంగల్ జాతీయ రహదారిపై వర్షపు నీటితో రోడ్లన్నీ నిండిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి బుధవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించి పరిస్థితిని అధికారులతో సమీక్షించారు. యాదాద్రి, వరంగల్ వరకు లక్షలాది వాహనాల రాకపోకలు సాగుతున్న రోడ్డు పై వర్షం నీటి నిలువ , గుంతలు లతో వాహనదారులు ఇబ్బంది పడుతుండాన్ని గమనించి ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి వెంటనే సంబంధిత అధికారులను ఆదేశించి రోడ్డుపై వర్షపు నీరు నిలవకుండా స్ట్రామ్ వాటర్ డ్రైన్ ద్వారా బయటకు పంపే ఏర్పాటు చేశారు, గుంతలను పూడ్చివేయాలని , ఇటీవల ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ప్రజలకు అసౌకర్యం కలగకుండా బీ.టీ. రోడ్లు వేయాలని, ఆర్ అండ్ బి మంత్రిని ఆదేశించిన విషయం విధితమే, వాహనదారుల సౌకర్యార్థం కారిడార్కు రెండు వైపులా నాణ్యమైన బీటీ రోడ్డు వేయాలని ఆదేశించగా నేషనల్ హైవే ఆర్ అండ్ బి అధికారులు త్వరలోనే టెండర్లను పిలిచి పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే కి తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీబీ శ్రీనివాసరావు, సీఐ అశోక్, గాయత్రి కన్స్ట్రక్షన్ ప్రాజెక్టు మేనేజర్ అశోక్ బంగర్, నేషనల్ హైవే ఆర్ అండ్ బి ఏ ఈ గోపికృష్ణ, ఉప్పల్ జిహెచ్ఎంసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, నాగేందర్, డి ఈ నిఖిల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధనపాల్ రెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

jayabheridaily.com
ప్రభాత జయభేరి



# యూట్యూబ్ వీడియోలు చేస్తోందని పరువు హత్య

**జయభేరి, ఖమ్మం :**

యూట్యూబ్ షార్ట్ వీడియోలు చేస్తూ దానికి బానిసైన చెల్లిని క్షణికావేశంలో హతమార్చాడో అన్న. తమది పరువుగల కుటుంబమని వీడియోలు తీసి యూట్యూబ్‌లో పెట్టి తమను బజారుకీడ్చొద్దని చెల్లిని హెచ్చరించాడు. అయినా చెల్లెలు తన మాట వినకుండా వీడియోలు చేస్తుండడంతో ఆగ్రహించిన అన్న విచక్షణ కోల్పోయి చంపేశాడు. ఇంట్లో ఉన్న రోకలి తీసుకుని చెల్లి తలపై కొట్టాడు. దీంతో తీవ్ర రక్తస్రావమైన చెల్లి ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మరణించింది. ఈ ఘోరమైన ఘటన కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలంలో ఈ ఘటన జరిగింది. రాజీవ్‌నగర్ తండాకు చెందిన అజ్మీరా శంకర్, దేవీకు అమ్మాయి అజ్మీరా సింధు (20), అజ్మీరా హరిలాల్ సంతానం. సింధు మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో నర్సుగా పని చేస్తోంది. హరిలాల్ పనులకు వెళ్లేవాడు. తండ్రి అజ్మీరా శంకర్ రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తల్లి అజ్మీరా దేవి కూలీ పనులకు వెళుతోంది. నర్సుగా పనిచేస్తూనే సింధు సరదాగా యూట్యూబ్‌లో వీడియోలు కూడా చేస్తోంది. ఇది అన్న హరిలాల్‌కు నచ్చలేదు.యూట్యూబ్‌లో వీడియోలు చేయొద్దని, తమది పరువు గల కుటుంబమని ఇంటి పరువు తీయొద్దని సూచించాడు. పలు మార్లు హెచ్చరించాడు. అయినా సింధు తన సోదరుడి మాటలు పట్టించుకోకుండా పోస్టు చేస్తోంది. ఈ విషయంలో సింధు, హరిలాల్ కొన్నాళ్లుగా గొడవ జరుగుతోంది. తల్లి వీరిని వారిస్తూ వచ్చింది. అన్న చెల్లెల్లు గొడవ పడొద్దని చెబుతూ వచ్చింది. అంతలోనే ఈ ఘోరం జరిగింది. ఇదే విషయంపై గత సోమవారం కూడా ఇంట్లో సింధు, హరిలాల్ మధ్య తీవ్ర స్థాయిలో గొడవ జరిగింది. యూట్యూబ్‌లో పోస్టు చేసిన వీడియోలన్నీ డిలీట్ చేయాలని, ఇకపై వీడియోలు చేయవద్దని హరిలాల్ సింధును హెచ్చరించాడు. ఇందుకు సింధు అంగీకరించలేదు. కోపోద్రిక్తుడైన హరిలాల్ ఇంట్లో ఉన్న రోకలిబండతో సింధు తలపై కొట్టాడు. తీవ్ర గాయాలైన ఆమెను కుటుంబసభ్యులు తొలుత ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్యం అందించారు. అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి, తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో సింధు మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఆధునిక యుగంలో సాంకేతికత అందరికి అందుబాటులోకి వస్తోంది. 4G, 5G ఇంటర్నెట్ స్పీడ్ యువతను సోషల్ మీడియా వైపు తిప్పుతోంది. యువత తమ చేతిలోని సెల్‌ఫోన్‌లో ప్రపంచాన్ని చుట్టేస్తున్నారు. గుర్తింపు పొందుతున్నారు. ఈ క్రమంలో యువత తమ ఫాలోవర్లను పెంచుకునేందుకు, గుర్తింపు తెచ్చుకునేందుకు ఇన్‌స్టాగ్రాంలో రీల్స్, యూట్యూబ్‌లో షార్ట్, ట్విటర్, ఇతర సామాజిక మాధ్యమాల్లో షార్ట్, వైరల్ వీడియోలో చేస్తున్నారు. ఇవి కొన్నిసార్లు శృతి మించుతున్నాయి. ప్రాణాల మీదకు తెస్తున్నాయి. ఇంట్లో పెద్దలు చెప్పిన మాట వినకుండా వీడియోలకే బానిసలవుతుండడంతో కుటుంబ సభ్యుల కోపానికి కారణమవుతున్నాయి.

# మావోయిస్టులను సమిష్టిగా ఎదుర్కోవాలి

**జయభేరి, హైదరాబాద్ :**

హైదరాబాదులో నాలుగు రాష్ట్రాల డీజీపీల సమావేశం జరిగింది.. తెలంగాణ డిజిపి అంజనీ కుమార్ అధ్యక్షతన మహారాష్ట్ర, చతిస్గడ్ ,ఆంధ్రప్రదేశ్ ,రాష్ట్రాల డీజీపీల సమావేశం జరిగింది. సౌత్ డిజిపిల సమావేశం పేరిట జరిగిన ఈ సమావేశంలో మావోయిస్టుల వ్యవహారం పైన అత్యంత కీలక చర్చ జరిగింది...తెలంగాణలో మావోయిస్టుల అలజడి పూర్తిగా గా తుడిచి పెట్టక పోయిందని ఒకవైపు తెలంగాణ ప్రభుత్వం చెబుతున్నప్పటికీ నిత్యం బార్డర్ జిల్లాల్లో ఇంకా పోలీసుల బూట్ల చప్పుళ్ళు కూంబింగ్ రూపంలో ఇంకా వినిపిస్తుంటాయి... తెలంగాణ బార్డర్ జిల్లాల్లో ఇతర రాష్ట్రాల పోలీసుల సహకారాన్ని కోరుతూ గతంలో అనేక సమావేశాలు జరిగాయి కానీ ఈసారి హైదరాబాద్ కేంద్రంగా తెలంగాణ డిజిపి కార్యాలయంలో నాలుగు రాష్ట్రాల డీజీపీల సమావేశం జరిగింది. దీంట్లో లెఫ్ట్ వింగ్ ఎక్స్ట్రీమిజం మీద పైన అత్యంత కీలకమైన చర్చ జరిగింది ...మావోయిస్టుల ప్రభావాన్ని ఏ రకంగా ఎదుర్కోవాలి ట్రైనింగ్ తో పాటుగా కలిసి ఏ రకంగా పనిచేయాలన్న అంశాల పైన పూర్తి స్థాయిలో చర్చ జరిగింది ... కోఆర్డినేషన్ ట్రైనింగ్ తో పాటు మావోయిస్టులకు సంబంధించిన సమాచారాన్ని ఏ రకంగా షేర్ చేసుకోవాలన్న చర్చ కూడా జరిగింది ..గతంలో మావోయిస్టు ప్రభావిత అనేక రాష్ట్రాల్లో ఇలాంటి మీటింగ్లు జరిగాయి .హైదరాబాద్ కేంద్రంగా జరిగిన ఈ నాలుగు రాష్ట్రాల డీజీపీల సమావేశంలో సిఆర్పిఎఫ్ ఉన్నతాధికారుల సైతం పాల్గొన్నారు... మహారాష్ట్ర చత్తీస్గడ్ ఆంధ్రప్రదేశ్ బోర్డర్లో ఇంకా తెలంగాణ సరిహద్దు జిల్లాల్లో ఉన్న మావోయిస్టుల ప్రభావాలను పూర్తిస్థాయిలో ఎదుర్కోవాలన్న చర్చ మాత్రం జరిగింది.

# అమ్మాయిలను వేదిస్తే ఈపులు పగుల్తయి

**ఆకతాయిలకు షీ టీమ్స్ హెచ్చరిక**

**జయభేరి, హైదరాబాద్ :**

సోషల్ మీడియా వేదికగా మహిళలపై వేధింపులకు పాల్పడుతున్న పోకిరీలపై తెలంగాణ ఉమెన్ సేఫ్టీ వింగ్‌లోని షీటీమ్స్ రంగంలోకి దిగాయి. ఇందుకోసం వినూత్నంగా ఫొటోలు, మీమ్స్, షార్ట్‌ఫిల్మ్‌లు, సందేశాత్మక వీడియోల ద్వారా సోషల్ మీడియానే ఉపయోగించుకొంటున్నది.ఆడపిల్లలను వేధించినా, అసభ్యంగా ప్రవర్తించినా, తిట్టినా, వారి ఫొటోలు, వీడియోలు మార్ఫింగ్ చేసినా, సోషల్ మీడియా అకౌంట్లలో పోస్టు చేసినా, మిత్రులకు షేర్ చేసినా తీవ్రమైన నేరంగా పరిగణించి.. ఎలాంటి కఠిన శిక్షలు వేస్తున్నారో సవివరంగా పోస్టుల ద్వారా షీటీమ్స్ అవగాహన కల్పిస్తున్నాయి. ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గట్టుగా సందేశాత్మక వీడియోలు, షార్ట్‌ఫిల్మ్‌లు రూపొందిస్తున్నది. వీటితో పాటుగా ఆయా కాలేజీల్లో, స్కూళ్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నది.

**టెక్నికల్ సిబ్బందికి శిక్షణ**

సోషల్ మీడియాలో మహిళలపై చోటుచేసుకుంటున్న వేధింపులను సమర్థవంతంగా అడ్డుకట్ట వేసేందుకు షీటీమ్స్ ప్రత్యేక కార్యచరణ రూపొందించింది. తెలంగాణ వ్యాప్తంగా అన్ని యూనిట్లలో ఉన్న షీటీమ్స్ సిబ్బందికి దఫాలుగా పలు అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇప్పించింది. పోకిరీ చేష్టలను ఉపేక్షించకుండా తక్షణమే కేసులు నమోదు చేసి, తల్లిదండ్రులు సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చి.. కటకటాలకు పంపేలా ప్రణాళికలు తయారుచేసింది. వీటితోపాటు సైబర్ స్టాకింగ్, సైబర్ బుల్లింగ్, బ్లాక్‌మెయిలింగ్ వంటి తదితర అంశాలను సీరియస్‌గా తీసుకొని సోషల్ మీడియాలో పేట్రేగిపోతున్న పోకిరీల ఆటకట్టించేందుకు, అరెస్టు చేసేందుకు షీటీమ్స్ రంగం సిద్ధం చేసింది.

# సోమవారం వరకు సెలవులేనా?

**జయభేరి, హైదరాబాద్ :**






తెలంగాణలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ, అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందును తెలంగాణ సర్కారు విద్యా సంస్థలకు బుధవారం, గురువారం రెండు రోజులు సెలవులు ప్రకటించింది. ఎడతెరిపి లేని వర్షాల కారణంగా రాష్ట్రంలోని అన్ని రకాల విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించాలని సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. అందుకు సంబంధించి తక్షణమే ఉత్వర్వులు జారీ చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని సీఎం కేసీఆర్ మంగళవారం ఆదేశించారు. దీంతో విద్యా శాఖ స్పందించి ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా జులై 26, 27 తేదీలను రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు సెలవు దినాలుగా ప్రకటించింది.ఈ రెండు రోజుల సెలవుల తర్వాత 28వ తేదీన ఆప్షనల్ హాలీడే ఉందని అంటున్నారు. తర్వాత రోజు 29వ తేదీన మొహర్రం పండుగ నాడు అధికారిక సెలవు ఉండనే ఉంది. 30వ తేదీన ఆదివారం రానే వచ్చంది. ఇలా వరుసగా ఐదు రోజులు సెలవులు వస్తున్నాయని ప్రచారం జరుగుతోంది.ప్రస్తుతం దీనికి సంబంధించిన వార్త నెట్టింట వైరల్ గా మారింది.ప్రభుత్వ క్యాలెండర్ ప్రకారం 28వ తేదీన మొహర్రం పండగ, 29వ తేదీన మొహర్రం జనరల్ హాలీడే ఉన్నాయి. 28వ ఆప్షనల్ హాలీడే కేవలం ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే ఉంటుంది. 29న సెలవు స్కూళ్లకు వర్తించనుంది. 30న ఎలాగూ ఆదివారం కాబట్టి వరుసగా మొత్తం ఐదు రోజులు సెలవులు వస్తున్నాయి. గడిచిన 24 గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా బాగానే వర్షాలు కురిశాయి. అత్యధికంగా ములుగు జిల్లా వెంకటాపురంలో 149.3 మిల్లీ మీటర్ల వర్షం కురవగా.. ఆసిఫ్ నగర్ లో 43.5 మిల్లీ మీటర్లు, ఆ తర్వాత టోలిచౌకీలో 37 మిల్లీ మీటర్లు, అల్వాల్ లో 3.3 మి.మీ, మాదాపూర్ లో 28 మి.మీ, మియాపూర్ లో 27 మి.మీ వర్షం కురిసింది.

**రాగల నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు**

షీయర్ జోన్ 17N అక్షాంశం వెంబడి సగటు సముద్ర మట్టం నుండి 5.8 కిమీ నుండి 7.6 కిమి ఎత్తువరకు స్థిరంగా కొనసాగుతూ ఎత్తుకు వెళ్లే కొలది దక్షిణ దిశ వైపు వంగి ఉంది. రాగల మూడు రోజులు భారీ వర్షాలు కొన్ని చోట్ల, భారీ నుండి అతిభారీ వర్షాలతో పాటు అత్యంత భారీ వర్షాలు తెలంగాణలో కొన్ని జిల్లాలలో అక్కడక్కడ వచ్చే అవకాశాలు ఉన్నాయి. రాగల 4 రోజులు తెలంగాణ రాష్ట్రంలో ఉరుములు మెరుపులతో పాటు ఈదురుగాలులు, గాలి వేగం గంటకు 40 నుండి 50 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉంది. ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలతో పాటు అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

**ఆరెంజ్ అలర్ట్ ఈ జిల్లాల్లో**

నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మిగిలిన జిల్లాల్లో ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

# తడిసి ముద్దవుతున్న తెలుగు రాష్ట్రాలు

**జయభేరి, హైదరాబాద్ :**



పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు తెలుగు రాష్ట్రాలు తడిసి ముద్దవుతన్నాయి. మరో రెండు రోజుల వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. వర్షాల ఎఫెక్ట్‌తో దేశంలో నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఎగువన కురుస్తున్న వర్షాలకు తోడు తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు కృష్ణా, గోదావరి బేసిన్లోని అన్ని ప్రాజెక్టులకు భారీగా వరద నీరు చేరుతోంది. కృష్ణానదిలో వరదతో కర్నాటకలోని ఆల్మట్టి ప్రాజెక్టు మంగళవారం ఉదయానికే 60 శాతం నిండింది. 129.72 టీఎంసీల కెపాసిటీ ఉన్న ఈ ప్రాజెక్టులో 74.22 టీఎంసీల నీళ్లు చేరాయి. ప్రస్తుతం ఆల్మట్టిలోకి 1.16 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. తుంగభద్రకు 72 వేల క్యూసెక్కులు, జూరాల, శ్రీశైలం ప్రాజెక్టుల్లోకి 9 వేల క్యూసెక్కుల చొప్పున ప్రవాహం వస్తోంది. బుధవారానికి ఈ ప్రాజెక్టు మూడు వంతులు నిండనుంది. గోదావరి బేసిన్‌లో వరద ఉధృతి గంట గంటకు పెరుగుతోంది. కడెం నుంచి సమ్మక్క సాగర్ (తుపాకులగూడెం) బ్యారేజీ వరకు అన్ని ప్రాజెక్టులు, బ్యారేజీల గేట్లు ఎత్తి నీటిని నదిలోకి వదులుతున్నారు. శ్రీరాం సాగర్ ప్రాజెక్టుకు వరద పెరిగింది. ఈ ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 90.31 టీఎంసీలు కాగా ఇప్పటి వరకు 65 టీఎంసీల నీరు చేరింది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 40 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోంది. మేడిగడ్డ వద్ద 5.72 లక్షల క్యూసెక్కులు, తుపాకులగూడెం దగ్గర 7.29 క్యూసెక్కులు వస్తోంది. దుమ్ముగూడానికి అత్యధికంగా 7.55 లక్షల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోంది. గోదావరి బేసిన్‌లో భారీ వర్షాలు కురుస్తుండటంతో భద్రాచలం దగ్గర మళ్లీ నీటి మట్టం పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. నదీ తీర ప్రాంతానికి వెళ్లొద్దని సూచిస్తున్నారు. అత్యవసర పరిస్థితి ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతానికి తరలి వెళ్లాలని సూచిస్తున్నారు.ప్రియదర్శని జూరాల ప్రాజెక్టుకు మంగళవారం భీమ నది నుంచి స్వల్పంగా వరద ప్రారంభమైంది. కర్ణాటక చిత్తాపూర్ తాలూకా భీమానది పై ఉన్న సనత్ బ్యారేజ్ నుంచి 7 వేల క్యూసెక్కుల నీరు జూరాలకు చేరుతోంది. వర్షాల కారణంగా మరో 3 వేల క్యూసెక్కులు చేరి మొత్తంగా జూరాలకు 10 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టు వద్ద వాటర్ లెవెల్ 318.01 ఉండగా.. నెట్టెంపాడు లిఫ్ట్‌కు 750 క్యూసెక్కులు, బీమా లిఫ్టు-1కి 1300 క్యూసెక్కులు, బీమా లిఫ్టు-2కి 750 క్యూసెక్కులు, లెఫ్ట్ కెనాల్ కు 640 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.. తెలుగు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా గత వారం రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మరో మూడు నాలుగు రోజులు ఇదే పరిస్థితి కొనసాగ నుంది. తెలంగాణలో ఉరుములు మెరుపులతో పాటు ఈదురుగాలులు, గాలి వేగం గంటకు 40 నుంచి 50 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉన్నట్లు వాతవరణ శాఖ హెచ్చరించింది. ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో రెడ్ అలెర్ట్ జారీ చేసింది. నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించారు. ఏపీ విషయానికొస్తే అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. శ్రీకాకుళం, పార్వతీపురంమన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ, పశ్చిమగోదావరి, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్ఆర్, శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

# అవిశ్వాస తీర్మానంతో గులాబీ స్కెచ్



**జయభేరి, హైదరాబాద్ :**

కేంద్రంపై ఇన్నాళ్లు సైలెంట్‌గా ఉన్న బీఆర్ఎస్ ఇప్పుడు అవిశ్వాస అస్త్రంతో యుద్ధం పునఃప్రారంభించింది. మూడు నెలల క్రితం వరకు కేంద్రంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేసే కేసీఆర్ ఈ మధ్య సైలెంట్ అయిపోయారు. అప్పుడప్పుడూ కేటీఆర్ సహా ఇతర మంత్రులు మాట్లాడటమే తప్ప పెద్దగా ఎదురు దాడి చేసింది లేదు. దీన్ని అవకాశంగా తీసుకున్న కాంగ్రెస్ ఆ రెండు పార్టీలపై విమర్శల స్వరాన్ని పెంచింది. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనంటూ గట్టిగానే ప్రచారం చేశాయి. దీనికి బీజేపీ అధ్యక్షుడి మార్పును కూడా ప్రస్తావించింది. అయితే వాటిని ఖండించేలా జరుగుతున్న ప్రచారాన్ని తప్పు పట్టేలా బీఆర్ఎస్ ప్లాన్ చేసింది. మణిపూర్‌లో జరుగుతున్న హింసపై ఇండియాలోని పక్షాలు ఏకమై కేంద్రంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాయి. వాటితో కలిస్తే మళ్లీ విమర్శలు వస్తాయని వేరుగా అవిశ్వాస తీర్మానాన్ని ఇచ్చింది బీఆర్ఎస్.

రెండు కూటములకు దూరంగా ఉంటున్న బీఆర్ఎస్ తీసుకున్న ఈ స్టెప్ రాష్ట్రంలో జరుగుతున్న ప్రచారానికి అడ్డుకట్ట పడుతుందని భావిస్తోంది. లోక్ సభలో బీజేపీకి పూర్తి మెజార్టీ ఉన్నప్పటికీ మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్ల అంశం ప్రజల్లో చర్చకు వస్తుందని బీఆర్ఎస్ చెబుతోంది. అదే టైంలో బీజేపీకి అనుకూలమంటూ తెలంగాణలో జరుగుతున్న ప్రచారాన్ని కూడా తిప్పికొట్టినట్టు అవుతుందని పార్టీ అంచనాగా చెబుతున్నారు. బీఆర్ఎస్ ఎంపీ నామ నాగేశ్వరరావు బుధవారం ఉదయం స్పీకర్‌కు అవిశ్వాస నోటీసు ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానానికి ఎంఐఎం కూడా మద్దతు ఇచ్చింది. ఆ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ సంతకం కూడా చేశారు. కాంగ్రెస్ తీర్మానంతో తమకు సంబంధం లేదంటున్నారు బీఆర్ఎస్ ఎంపీలు. తాము విడిగా అవిశ్వాసం తీర్మానం ప్రవేశ పెట్టామని చెబుతున్నారు. కచ్చితంగా ఈ నోటీసుతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నోరు తెరవాలని డిమాండ్ చేస్తున్నారు నేతలు.




# బీఆర్ ఎస్ లో అంతా వనమాలే

**జయభేరి, హైదరాబాద్ :**

బీఆర్ఎస్ పార్టీపై ఎప్పుడూ ఏదో ఒక విమర్శలు చేస్తూ ఉంటారు వైఎస్ షర్మిల. తాజాగా కొత్త గూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుపై హైకోర్టు అనర్హత వేటు వేయడంపైన కూడా షర్మిల స్పందించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే, బీఆర్ఎస్ పార్టీలో ఉన్న ఎమ్మెల్యేలు అందరూ వనమా వెంకటేశ్వరరావు లాంటివారేనని షర్మిల ఎద్దేవా చేశారు. వారు అందరూ ఎన్నికల సంఘాన్ని తప్పుదోవ పట్టించిన వాళ్లే అని, దొరల్లా చెలామణి అవుతున్నారని ఎద్దేవా చేశారు. అధికార పార్టీ ఎమ్మెల్యేల అఫిడవిట్లు తక్షణం తనిఖీ చేసి, తప్పుడు సమాచారం ఇచ్చిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని షర్మిల డిమాండ్ చేశారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి YSR తెలంగాణ పార్టీ విజ్ఞప్తి చేస్తుందని షర్మిల ట్వీట్ చేశారు.'BRS లో ఉన్న ఎమ్మెల్యేలంతా మరో వనమాలే. అంతా ఎన్నికల కమీషన్ ను తప్పు దోవ పట్టించిన వాళ్లే. దొరల్లా చెలామణి అవుతూ దొరక్కుండా తిరుగుతున్న దొంగలే. ఎన్నికల అఫిడవిట్లో చూపింది గోరంతైతే దాచింది కొండంత. లెక్కకు రాని ఆస్తులు, అంతస్తులు అనంతం.అధికార పార్టీ ఎమ్మెల్యేల అఫిడవిట్లు తక్షణం తనిఖీ చేసి, తప్పుడు సమాచారం ఇచ్చిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి YSR తెలంగాణ పార్టీ విజ్ఞప్తి చేస్తుంది. ఎన్నికల సంఘాన్ని మోసం చేసి అధికారం అనుభవిస్తున్న వారిని మళ్లీ పోటీకి అనర్హులుగా ప్రకటించాలని కోరుతున్నాం'' అని వైఎస్ షర్మిల ట్వీట్ చేశారు.ఇటీవలే షర్మిల సీఎం కేసీఆర్ పై విమర్శలు చేశారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టే ఛాన్స్ లేదన్నారు YSRTP అధ్యక్షురాలు వైఎస్ షర్మిల. తొలిసారి ఉద్యమ సెంటిమెంట్ తో ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన కేసీఆర్.. రెండోసారి తెలంగాణ ఆత్మగౌరవం పేరుతో కుర్చీని కాపాడుకున్నారు అని ఎద్దేవా చేశారు. మూడోసారి గెలిచే ఛాన్సే లేదని, దమ్ముంటే సిట్టింగులకు సీట్లు ఇచ్చి ఎన్నికల బరిలో నిలవాలని సీఎం కేసీఆర్ కు షర్మిల సవాల్ విసిరారు. ఇన్నాళ్లు దొరగారు దర్జాగా గడీల్లో ఉంటే.. పార్టీ ఎమ్మెల్యేలు బందిపోట్ల లెక్క ప్రజల మీద పడి దోచుకున్నారు అని ఆరోపించారు. ఎన్నో ఆశలు, ఆశయాలతో సాధించుకున్న తెలంగాణలో తొమ్మిదేండ్ల నుంచి అవినీతి ఏరులై పారించిన ఘనత కేసీఆర్ కు దక్కుతుందన్నారు. తన కుటుంబానికి పదవులు కట్టబెట్టి, ఉద్యమ ద్రోహులను నెత్తిన పెట్టుకున్నాడు కేసీఆర్ అని మండిపడ్డారు. కేసీఆర్ ఫాంహౌస్ లో కూర్చుంటే ఎమ్మెల్యేలు కబ్జాలు, అవినీతికి పాల్పడ్డారని పదే పదే ప్రస్తావించారు. నేతల అవినీతిని ప్రశ్నించిన వారిని చితకబాదారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని కేసీఆర్ కు అర్థమైందన్నారు షర్మిల. అందుకే సర్వేల పేరుతో హడావుడి చేస్తున్నారని వ్యాఖ్యానించారు. సిట్టింగులకు సీట్లు అని మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూనే... సర్వేలు ఎందుకు చేస్తున్నారని కేసీఆర్ ప్రశ్నించారు. ఎన్నికలు దగ్గరపడే కొద్దీ జనం ఎమ్మెల్యేలపై గుర్రుగా ఉన్నారని తెలుసుకున్న దొర ఉలిక్కిపడుతున్నారు అని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యేలను మారిస్తే తప్ప ఎన్నికల్లో గట్టెక్కలేనని తెలుసుకున్నారు కేసీఆర్. మీది అవినీతిరహిత పాలనే అయితే, హామీలు నెరవేర్చి ఉంటే.. ఎన్నికల మ్యానిఫెస్టోకి న్యాయం చేసిన వారే అయితే.. మరోసారి సిట్టింగ్ ఎమ్మెల్యేలకు సీట్లు ఇచ్చి ఎన్నికల బరిలో నిలవాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ కు దమ్ముంటే తన సవాల్ స్వీకరించాలన్నారు. మీరు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సుద్ధపూసలు అయితే గెలిచి మీ పాలనకు ఇది రెఫరెండం అని ప్రూవ్ చేయాలని వైఎస్సార్ టీపీ డిమాండ్ చేసింది.

# నేను విన్న శ్రీరామ్ సాగర్ నేను కలలు కన్న శ్రీరామ్ సాగర్

- నేను కళ్లార చూస్తున్న శ్రీరామ్ సాగర్
- ఎస్సారెస్పీకి జలకళ సీఎం కేసిఆర్ తోనే సాధ్యం అయ్యింది
- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



**జయభేరి, బాల్కొండ :**

శ్రీరామ్ సాగర్ (SRSP) ప్రాజెక్ట్ పనులకు శ్రీకారం చుట్టి నేటికి 60 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా బుధవారం ప్రాజెక్టు వద్ద జరిపిన "శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ 60 వసంతాలు వేడుక" కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ పై ఉన్న భారత మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకంలో భాగంగా నిర్మించిన ముప్కాల్ పంప్ హౌజ్ వద్ద వేడుకలో పాల్గొని మంత్రి ప్రసంగించారు. 1951 లో ఆనాటి హైదరాబాద్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ఈ ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టు నిర్మించాలని ప్రతిపాదనలు పంపిస్తే..12 సంవత్సరాలు తర్వాత అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ 1963లో 4లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు 40 కోట్ల వ్యయంతో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారని గుర్తు చేశారు. ఎస్సారెస్పీ పూర్తి చేసి 1983 లో డ్యాంలో నీటిని నింపారని అన్నారు. ప్రాజెక్ట్ మొదటి ఫేజ్ పూర్తి కావడానికి సుమారు 20 ఏళ్లు పట్టిందని అన్నారు. 201516 సంవత్సరంలో పది లక్షల ఎకరాల అయకట్టు కు నీల్లు అందిచేలా రెండో ఫేజ్ పనులు పూర్తి అయ్యాయనీ తెలిపారు. ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ కు ఎన్నో అంశాలు అడ్డుగా నిలిచాయని, 1956లో ఆంధ్ర ప్రాంతంతో తెలంగాణను కలిపిన తర్వాత అప్పటి ఉమ్మడి రాష్ట్ర పాలకులు తెలంగాణ వర ప్రదాయిని నీ నిర్లక్ష్యం చేశారని తెలిపారు. ఈ ప్రాంత రైతాంగానికి తీవ్ర అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాజెక్టులకు అన్యాయం జరిగిందనీ కేసిఆర్ గారు ఎన్నో సార్లు ఆవేదన వ్యక్తం చేశారని,ఆంధ్ర ప్రాజెక్టులు వైష్ణవ ఆలయాలు లాగా,తెలంగాణ ప్రాజెక్టులు శివాలయాలుగా ఉన్నాయని 1996లో ఎస్సారెస్పీ కట్ట మీద ప్రాజెక్ట్ దుస్థితి చూసి కేసిఆర్ వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. ఎన్నో సార్లు ఎండిపోయిన శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ చూశానని అన్నారు. 200910 సంవత్సరంలో ఆర్మూర్ జెఏసి చైర్మన్ జర్నలిస్ట్ చారి అధ్వర్యంలో బాల్కొండ ప్రాంతంలో 100కి. మీ పాదయాత్ర చేపట్టామని అప్పుడు ఎస్సారెస్పీ ప్రాజెక్టును కళ్ళారా చూశాననీ నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు మంత్రి. గంగమ్మ తల్లి తెలంగాణ రాష్ట్రం ఏర్పడేలా దీవించు..ఈ ప్రాంతం పచ్చ బడేలా దీవించు,నీవు తరిలా తల్లి అని పూజలు చేశామని తెలిపారు. ఇక్కడ ఎంతో మంది హేమహేమి ఇరిగేషన్ ఇంజనీర్ల నడుమ ఈ వేడుకల్లో పాల్గొనడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది అని తెలిపారు. ఒక్కో ఇంజనీర్ తో తన అనుబంధాన్ని మంత్రి ఈ సందర్భంగా పంచుకున్నారు. ఎస్సారెస్పికి రివర్స్ పంప్ ద్వారా నీరు వస్తుందా అని సందేహాలు వ్యక్తం చేశారు కానీ కేసిఆర్ దాన్ని సాధ్యం చేశారని అన్నారు. పునర్జీవ పథకం ద్వారా కాళేశ్వరం జలాలు శ్రీరాం సాగర్ ప్రాజెక్టు లోకి తీసుకొచ్చామని,ఎస్సారెస్పి ద్వారా 18 లక్షల ఎకరాలకు నీరందించేలా ప్రణాళికలు చేశామన్నారు. ప్యాకేజీ 21,22 ద్వారా ఉమ్మడి జిల్లాలోని గ్రామాలకు కాళేశ్వరం జలాలను త్వరలో అందిస్తామన్నారు. పునర్జీవ పథకం తో రైతులకు భరోసా వచ్చిందన్నారు. పునరుజ్జీవ పథకం ద్వారా ఎస్సారెస్పీ ఎప్పుడూ నిండు కుండలా ఉంటుందని తద్వారా అలీ సాగర్,గత్పాలిఫ్ట్,నవాబ్ లిఫ్ట్,లక్ష్మి కెనాల్,చౌట్ పల్లి హన్మంత్ రెడ్డి లిఫ్ట్, బోదేపల్లి లిఫ్ట్ ల ద్వారా నిజామాబాద్ జిల్లా బాల్కొండ రైతాంగానికి సాగు నీరు అందించే ప్రణాళిక రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో ఉద్యమ కారుడు, రాష్ట్ర ప్రభుత్వ ఇరిగేషన్ శాఖ సలహాదారు శ్రీధర్ రావుదేశ్ పాండే,ఈఎన్సి నాగేందర్,ఎస్సారెస్పీ సి.ఈ సుధాకర్ రెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్ట్ సి.ఈ నల్లా వేంకటేశ్వర్లు,నిజామాబాద్ సి.ఈ మధుసూదన్,సి.ఈ శంకర్, ఎస్.ఈ శ్రీనివాస రెడ్డి,సీనియర్ ఇంజనీర్ విజయ ప్రకాష్ పలువురు ఇరిగేషన్ శాఖ ఈ.ఈ లు,ఏ.ఈ లు పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రాముడి అన్నసత్రంలోకి నీరు

**జయభేరి, ఖమ్మం :**

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో మరోసారి గోదావరి నదిలో వరద పోటెత్తుతోంది.. గత నెల 20వ తేదీ నుంచి గోదావరి దోబూచులాట ఆడుతోంది.. గోదావరిలో నీటిమట్టం భద్రాచలం వద్ద 44 అడుగులకు చేరుకుంది. దీంతో అప్పుడే భద్రాచలం రామాలయం చుట్టూ నీళ్లు చేరుతున్నాయి. స్లోయిస్ నుంచి నీళ్లు గోదావరిలోకి పోకపోవటంతో రామాలయం పడమర వైపు నీళ్లు ప్రవహిస్తున్నాయి. ఇవన్నీ అన్నదాన సత్రంలోకి ప్రవేశించాయి. అదేవిధంగా పడమర వైపు ఉన్న దుకాణాలు కూడా నీళ్లు వచ్చి చేరుకున్నాయి. నిన్నటి నుంచి భద్రాచలం పట్టణంలో భారీగా వర్షం కురుస్తుంది.. ఆ వర్షపు నీళ్లని గోదావరి కరకట్ట పక్కనే ఉన్న దగ్గరికి చేరుకుంటున్నాయి.అయితే గోదావరికి 44 అడుగులు చేరుకోవడంతో స్లోయిస్ లన్ని కూడా మూసుకుంటున్నాయి.. దీంతో స్లోయిస్ నుంచి గోదావరిలకి నీళ్లు పోయే దారి లేకపోవడంతో రామాలయం వరద నీరు పేరుకొని పోతుంది. ఇక, ఈ నీటిని మోటార్లతో గోదావరి నదిలోకి చేరవేయడం నిరంతర ప్రక్రియ.. కానీ, ఇక్కడ ఉన్న ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడం, అధికారులు నిర్లక్ష్యం వల్ల మోటార్లు పూర్తిస్థాయిలో పనిచేయకపోవడంతో వరద నీరంతా సత్రం వద్ద పేరుకుని పోయింది. ఇలా వరద నీరు పేర్కొనటంతో అన్నదాన సత్రంలోకి నీళ్లు రావడంతో ఆ సత్రాన్ని మూసివేయాల్సి వచ్చింది. అదేవిధంగా దుకాణ సముదాయంలోకి నీళ్లు రావడంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇక, అశ్వాపురం మండలంలో పొంగి ప్రవహిస్తున్నాయి లోతు వాగు, ఇసుక వాగు.. దీంతో.. గిరిజన గ్రామాలకు రాకపోకలకు బంద్ అయ్యాయి. మరోవైపు.. కిన్నెరసాని ప్రాజెక్ట్ కు వరద పోటెత్తింది.. దీంతో 4 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.. డ్యాం పూర్తి సామర్థ్యం 407 అడుగులు కాగా.. ప్రస్తుతం నీటిమట్టం 402.80 అడుగులుగా ఉంది.. ఇన్ ఫ్లో 25,000 క్యూసెక్కులుగా ఉంటే.. 4 గేట్ల ద్వారా 25,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు అధికారులు.. కిన్నెరసాని పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

## పట్టించుకోవడం లేదని పాముతో నిరసన

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణలో గత కొద్ది రోజులుగా వర్షాలు దంచికొడుతున్నాయి. దీంతో జనాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ఇళ్ల లోకి నీరు చేరుతున్నాయి. దీంతో పాములు, విషకీటకాలు ఇళ్లలోకి వస్తున్నాయి. హైదరాబాద్ లో భారీ వర్షాలకు వరద, మురుగునీరు ఇళ్లలోకి వస్తుంది.ఆల్వాల్ జీహెచ్ఎంసీ పరిధిలో ఇళ్లలోకి వరద నీరు వచ్చి చేరుతుంది. అంతేకాకుండా.. వరద నీరుతో పాములు కూడా వస్తున్నాయి. దీంతో జీహెచ్ఎంసీ అధికారులకు పాములు, విష కీటకాలు వస్తున్నాయని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదు. మరోవైపు తాజాగా ఈ విషయాన్ని అధికారులకు చెప్పడంతో ఎలాంటి స్పందన రాకపోవడంతో.. ఓపిక నశించి సంపత్ కుమార్ అనే వ్యక్తి వినూత్న రీతిలో వ్యక్తం చేశాడు. తన ఇంట్లోకి వచ్చిన పాముతో ఆల్వాల్ జీహెచ్ఎంసీకి తీసుకొచ్చాడు. కార్యాలయంలోని ఓ టేబుల్ మీద పామును విడిచిపెట్టి వినూత్న నిరసన చేపట్టాడు. ఆ పామును చూసిన కార్యాలయం సిబ్బంది ఒక్కసారిగా షాక్ కు గురయ్యారు. అల్వాల్ భారతినగర్ లో ఓ పాడు పడ్డ ఇంట్లో చెట్ల పొదలు పెరిగి, పాములు వస్తున్నాయి. దీంతో పక్కింటి వారు 15 రోజుల క్రితం అల్వాల్ వార్డు ఆఫీస్ లో ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ పట్టించుకోవడంలేదని పాముతో సంపత్ అనే వ్యక్తి వార్డు ఆఫీసుకు చేరుకున్నాడు. ప్రైవేట్ ప్రాపర్టీ కావడంతో, చెట్ల పొదలను క్లీన్ చేసే అధికారం తమకు లేదనీ GHMC అధికారులు తెలిపారు. దీంతో జీహెచ్ఎంసీ ఆఫీసు నుండి పామును తీసుకెళ్లి దగ్గర్లోని చెరువులో వదిలేశారు. కాలనీ వాసులు ఎన్నిసార్లు GHMC అధికారులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోకపోవడంతో తాము అనుభవిస్తున్న బాధను అధికారులకు ప్రత్యేక్షంగా చూపించేందుకు వెళ్ళామని కాలనీ వాసులు అంటున్నారు. మరోవైపు పాముతో నిరసన తెలిపిన సంపత్ పై జీహెచ్ఎంసీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు సమాచారం. మరోవైపు తమ పిల్లలు కాలనీలో ఆడుకోవాలంటేనే భయపడుతున్నారని తమ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## పోలవరానికి కేంద్రమే ఖర్చు

**జయభేరి, విశాఖపట్టణం :**

పోలవరం ప్రాజెక్టు విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎక్కడా తప్పుకోలేదని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి స్పష్టం చేశారు. నిర్మాణానికి అవుతున్న ప్రతీ పైసా కేంద్రం నుంచే వస్తోందని ఆమె అన్నారు. పునరావాసానికి సంబంధించిన లెక్కలు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావడం లేదని తెలిపారు. పోలవరం లెక్కలకు సంబంధించి ప్రభుత్వం సవరణ కోరిందని ఆ విషయంలో తాము కూడా త్వరలో కేంద్ర జలశక్తి మంత్రిని కలవనున్నామని పురంధేశ్వరి ప్రకటించారు. కేంద్ర నాయకత్వం ఎక్కడి నుంచి పోటీ చేయమని చెప్తే అక్కడి నుంచి తాను పోటీ చేస్తానని పురంధేశ్వరి తెలిపారు. జనసేనతో పొత్తు కొనసాగుతుందని స్పష్టం చేశారు. మిగిలిన పొత్తులపై కేంద్ర నాయకత్వం నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాలకు అందిస్తున్న నిధులను ఏపీ ప్రభుత్వం దారిమళ్లిస్తోందని పురంధేశ్వరి ఆరోపించారు. పంచాయతీలకు నిధులు అందని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. పార్టీలకతీతంగా సర్పంచ్‌లు తమను కలిసి ఆవేదనను వెళ్లబోసుకున్నారని తెలిపారు.రాష్ట్రంలో మట్టి మాఫియా, ఇసుక మాఫియా చెలరేగిపోతోందని పురంధేశ్వరి ఆరోపించారు. 10 లక్షలు, 15 లక్షల రూపాయల పనులు చేసే చిన్న కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందని విమర్శించారు. రైతు పక్షపాత ప్రభుత్వం అని చెప్పుకునే సీఎం, రైతులకు నిజంగా ఏం మేలు చేశారని పురంధేశ్వరి ప్రశ్నించారు.

## జగనన్నతోనే భవిష్యత్తుకు భరోసా



**జయభేరి, కర్నూలు:**

ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డితోనే పేదల భవిష్యత్తుకు భరోసా లభించిందని వైయస్ఆర్ సిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు, నగర మేయర్ బి.వై. రామయ్య, నంద్యాల జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. బుధవారం మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న 19వ వార్డులో 47వ సచివాలయ పరిధిలో వారు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. 19వ వార్డులో తొలి రోజు జోరువాన కురుస్తున్న కూడా కార్యక్రమం కొనసాగించడం విశేషం. అలాగే స్థానిక సచివాలయ ఎ.ఎన్.ఎం. అనురాధ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి ఆమెకు తినిపించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అవినీతి రహిత పాలనే సంకల్పంగా, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, అన్ని ప్రాంతాల అభ్యున్నతే లక్ష్యంగా సమర్థవంత పాలనా అందిస్తున్న దమ్మున్న ఏకైక వ్యక్తి వైయస్ జగన్ మాత్రమే అన్నారు. ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ ప్రతి సచివాలయ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం 20 లక్షలు విడుదల చేస్తే, కల్లూరు అర్బన్ కి మాత్రం అదనం 3 కోట్లు మంజూరు చేశారన్నారు. తద్వారా మరో 20 లక్షలు ప్రతి సచివాలయానికి మంజూరు అయ్యాయన్నారు. ఒక్కొక్క సచివాలయానికి రూ.40 లక్షలు కేటాయించేందుకు ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కరిస్తారానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు.




## ఇయర్ ఫోన్స్ పెట్టుకుంటే 20 వేల జరిమానా?

**జయభేరి, విజయవాడ :**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం కొత్త ఆర్టీవో రూల్స్ తీసుకొస్తుందనే వార్త సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. చాలా వరకు రోడ్డు ప్రమాదాలు సెల్‌ఫోన్ చూస్తూనో మాట్లాడుతూనో జరుగుతున్నాయి. ఈ మధ్య కాలంలో ఇలాంటి కేసులు ఎక్కువ అయ్యాయని అందుకే ఏపీ ప్రభుత్వం వీటి నివారణపై దృష్టి పెట్టిందని అంటున్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ కొందరు డ్రైవింగ్ చేస్తుంటారు. మరికొందరు ఎవరికీ కనిపించకుండా బ్లూటూత్ ఇయర్‌ఫోన్స్ పెట్టుకొని మాట్లాడుకుంటూ ఉంటారు. మరికొందరు హెడ్‌సెట్ పెట్టుకొని జాయిగా వెళ్లిపోతుంటారు. ఇలాంటి వారికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం సీరియస్‌గా ఓ నిర్ణయం తీసుకుందని సోషల్ మీడియాలో ఓ వార్త వైరల్‌గా మారుతోంది.డ్రైవింగ్ చేస్తూ ఇయర్‌ఫోన్స్, హెడ్‌సెట్ పెట్టుకుంటే 20,000 జరిమానా విధించబోతోందని ఆ వార్త సారాంశం. ఆగస్టు నెల నుంచి ఇది ప్రారంభం కానుందని కూడా చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బైక్ మీద కానీ కారులో కానీ ఆటోలో కానీ ఇయర్ ఫోన్స్ హెడ్సెట్ పెట్టుకొని డ్రైవింగ్ చేస్తే 20,000 జరిమానా వేస్తారని పుకార్లు ఉన్నాయి. దీనికి సంబంధించిన వివరాలు త్వరలోనే రవాణా శాఖ అధికారులు వెల్లడించబోతున్నట్టు కూడా చెబుతున్నారు. ఇలా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ కంటెంట్‌పై నిజనిర్ధారణ కోసం ఏబీపీ దేశం ప్రభుత్వాన్ని సంప్రదించింది. అయితే రవాణా శాఖాధికారులు తమకు అలాంటి అదేశాలు ఇంకా రాలేదని చెబుతున్నారు. దీనిపై తమకు ఎలాంటి సమాచారం లేదని కూడా చెబుతున్నారు.

## సీమ సాగునీటి ప్రాజెక్టు ద్రోహం

**జయభేరి, విజయవాడ :**



రాయలసీమ నీటి ప్రాజెక్టుల కోసం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నిధులు పూర్తిగా తగ్గించేసిందని టీడీపీ అధినేత చంద్రబాబు ఆరోపించారు. రాయలసీమ మొత్తం 12 ప్రాజెక్టులకు తెలుగుదేశం హయాంలో ఖర్చు పెట్టింది 12 వేల కోట్లు జగన్ తన హయం లో ఖర్చు పెట్టింది 2000 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారని ప్రజెంటేషన్ ఇచ్చారు. అమరావతిలో జరిగిన సమావేశంలో సీమ ప్రాజెక్టులకు ప్రభుత్వ కేటాయింపులు, రాయలసీమకు నల్లిచ్చిలా టీడీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. 201419 మధ్య ఇరిగేషన్ కు టిడిపి ప్రభుత్వం ఖర్చు పెట్టింది రూ.68,293 కోట్లు ఖర్చు అయితే సీఎం జగన్ ప్రభుత్వం ఖర్చు పెట్టింది రూ. 22165 కోట్లు మాత్రమేనన్నారు. తెలుగుదేశం హయాంలో ఇరిగేషన్ కి మొత్తం బడ్జెట్లో 9.67% పైగా ఖర్చు పెడితే ..ఇప్పుడు ఇరిగేషన్ కి మొత్తం బడ్జెట్లో 2శాతం మాత్రమే కేటాయించారని ఆరోపించారు. రాయలసీమ ప్రాజెక్ట్స్ గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ప్రజలకు తెలియజేశారు. నీటి కోసం దేశాల మధ్య, రాష్ట్రాల మధ్య యుద్ధాలు జరిగాయన్నారు. రాయలసీమ అభివృద్ధి ఎన్టీఆర్ తెచ్చిన తెలుగు గంగ ప్రాజెక్ట్ తోనే ప్రారంభమైందన్నారు. కృష్ణ, గోదావరి నదుల అనుసంధానం వల్ల రాష్ట్రానికి మేలు కలుగుతుందని తెలిపారు. రాయలసీమ ప్రజలకు హోప్ కలిగించిన పార్టీ టీడీపీ అని అన్నారు. అనంత లాంటి జిల్లాల్లో పదేళ్లల్లో ఎనిమిదేళ్లు వేరుశెనగ పంటలు ఎండిపోయిన పరిస్థితులు ఉండేవన్నారు. కరవులో ఉన్న సీమ ప్రజలకు తెలుగు గంగను ఎన్టీఆర్ ప్రారంభించారని గుర్తుచేశారు. హంద్రీ నీవా, గాలేరు నగరి ప్రాజెక్టులకు అంకురార్పణ చేశారని తెలిపారు. ఆ తర్వాత పట్టిసీమ ద్వారా సీమకు నీటిని తరలించామని చెప్పారు. నదుల అనుసంధానం ప్రాజెక్టులు చేపట్టాలని అప్పటి ప్రధాని వాజ్ పేయిని కోరానని.. గంగా కావేరీ కలపాలని సూచించామన్నారు. ఏపీ విభజన తర్వాత పోలవరం ద్వారా కృష్ణా గోదావరి నదుల అనుసంధానం కోసం ప్రయత్నించామని తెలిపారు. దీనికి అనుగుణంగా వివిధ ప్రాజెక్టులను రూపొందించి వాటిల్లో కొన్నింటికి టెండర్లు కూడా టీడీపీ హయాంలో పిలిచామన్నారు. నదుల అనుసంధానం ద్వారా ఏపీలో ప్రతీ ఎకరాకు నీరందించే ప్రయత్నం చేశామన్నారు. టీడీపీ హయాంలో మొత్తం బడ్జెట్టులో 9.63 శాతం ఇరిగేషన్ కోసం కేటాయింపులున్నాయని.. కానీ జగన్ హయాంలో మొత్తం బడ్జెట్టులో 2.35 శాతం మాత్రమే ఇరిగేషన్ కోసం ఖర్చు పెట్టిందని చంద్రబాబు నాయుడు వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు ప్రాధాన్య రంగాలకు కేటాయింపులు పూర్తిగా తగ్గించడంపై చందర్బాబు విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రెస్ మీట్ పెట్టి గ్రాఫ్‌ల ద్వారా ప్రజలకు వివరిస్తున్నారు. సాగునీటి ప్రాజెక్టుల పనులు పూర్తి స్థాయిలో జరగడం లేదన్న విమర్శలు వస్తున్న సమయంలో అసలు పూర్తిగా నిధులు తగ్గించేశారని చంద్రబాబు బయట పెట్టారు.

## అంగన్వాడీల్లో సిబ్బంది నియామకానికి ఇంటర్వ్యూలు

**జయభేరి, ఏలూరు :**

ఏలూరు డివిజన్ పరిధిలోని ఏలూరు, పెదపాడు, భీమడోలు, కైకలూరు, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడీ సిబ్బంది నియామకానికి ఏలూరు ఆర్డిఓ కె. పెంచల కిషోర్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో బుధవారం ఏలూరు, పెదపాడు, భీమడోలు, కైకలూరు, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడీల్లో 10 మంది అంగన్వాడీ సహాయకురాలు, 24 మినీ అంగన్వాడీ కార్యకర్తల నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు 85 మంది అభ్యర్థినులు హాజరైనట్లు ఆర్డిఓ కె. పెంచల కిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి కెవెల్ వివెల్ పద్మావతి, సిడిపివో ఎ. పద్మావతి. ఇంఛార్జి డిప్యూటీ డిఎంహెచ్ ఓ డా. లీలా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వస్తువులు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించండి

**జయభేరి, విజయనగరం :**



ప్రతీ మనిషి తన నిజజీవితంలో వాడే ప్రతీ వస్తువులు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించండి అంటూ జిల్లా వినియోగదారులు న్యాయస్థానం న్యాయమూర్తి ఆర్. వెంకట నాగ సుందర్ తెలియచేసారు.. బుధవారం విజయనగరం శ్రీ చలపతి స్కూలలో జరిగిన అడగండి చెబుతాం అన్న కార్యక్రమంకి ముఖ్య అతిగా విచ్చేసి విద్యార్థుల నిద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలోఎన్నో చోట్ల వినియోగదారులుకు జరుగుతున్న అన్యాయం పై అయన మాట్లాడుతూ,, వినియోగదారులు కు సేవలు అందించేందుకు జిల్లా వినియోగదారుల నాయస్థానం ఎల్లవేళలా సిద్ధంగా ఉంది అని తెలియచేసారు..

**కల్తీలను అరికట్టాలి. డా. హరిబాబు**

ప్రస్తుతము మనిషి నిజ జీవితంలోనకిలీ ఆహారపదార్థాలు ను తింటూ అనారోగ్యం పాలౌతున్నారు అంటూ సిసిఐ నేషనల్ వయిస్ ప్రెసిడెంట్ డా. చదలవాడ హరిబాబు తెలియచేసారు.. విజయనగరం జిల్లాలో 2 రోజులు పాటు నిర్వీహిస్తున్న, అడగండి చెబుతాం అన్నకార్యక్రమంలో భాగంగా కల్తీ, తునికలు కొలతలు లో మోసాలు విషయం పై అవగాహనా సదస్సును విజయనగరం శ్రీ చలపతి హైస్కూల్ లో ఏర్పాటు చేయడం జరిగింది.

ఈ కార్యక్రమం లోఐహెచ్ఆర్ఏ సివిల్ రైట్స్ ఆంధ్ర ప్రదేశ్ చర్మెన్ కరణం తిరుపతి నాయుడు, కన్స్యూమర్ వెల్ఫేర్ సొసైటీ విజయనగరం జిల్లా అద్యక్షులు ఎం ఎస్.శ్రీనివాస్,శ్రీకాకుళం జిల్లా కన్స్యూమర్ వెల్ఫేర్ సొసైటీ అద్యక్షులు బుర్గపు రాజేశ్వర్ రావు , శ్రీ చలపతి స్కూల్ అధినేత కోరాడ రాజేష్ వారి సిబ్బంది పాల్గొన్నారు. అదేవిదంగా జిల్లా జడ్జి చేతులు మీదుగా గోడ పత్రిక విడుదల చేసారు.ఈ కార్యక్రమం కన్స్యూమర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిందని ఎం.ఎస్. శ్రీనివాస్ రావు తెలిపారు.

jayabheridaily.com
ప్రభాత జయభేరి

## డేటింగ్ యాప్ తో పరిచయం

**జయభేరి, ఛండీఘడ్ :**

మహిళలు, ఆడపిల్లలపై అత్యాచారాల ఘటనలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఎన్ని చట్టాలు చేసినా మహిళలపై అఘాయిత్యాలు ఆగడం లేదు. తాజాగా హర్యానాలోని గురుగ్రామ్‌లో ఓ దారుణం చోటుచేసుకుంది. సెక్టార్ 50 ప్రాంతంలోని హోటల్‌లో డేటింగ్ యాప్‌లో పరిచయమైన వ్యక్తి, అతని స్నేహితుడు ఒక మహిళపై అత్యాచారానికి పాల్పడ్డారని పోలీసులు మంగళవారం తెలిపారు.బాధితురాలి ఫిర్యాదు ప్రకారం.. ఆమె డేటింగ్ యాప్ ద్వారా నిందితుడిని కలిసిందని, ఆ తర్వాత జూన్ 29న ఆమెను నిందుతుడు హోటల్‌కు ఆహ్వానించాడని పోలీసులు తెలిపారు. ఆమె హోటల్‌కు చేరుకున్నప్పుడు, ఇద్దరు వ్యక్తులు ఆమెకు ఆహారం అందించారని, అది తిన్న తర్వాత ఆమె స్పృహ కోల్పోయిందని ఆమె ఆరోపించింది. "దీనిని సద్వినియోగం చేసుకుని, వారు నాపై అత్యాచారం చేసి, ఆ చర్యను వీడియో కూడా తీశారు. నేను స్పృహలోకి వచ్చిన తర్వాత వారిని నిలదీస్తే, నిందితుడు ఆమె వీడియోను వైరల్ చేస్తానని బెదిరించాడు. ఎలాగోలా ఇంటికి తిరిగి వచ్చాను కానీ ఇప్పుడు పోలీసులను ఆశ్రయించాను' అని ఆమె తన ఫిర్యాదులో పేర్కొంది. సెక్టార్ 50 పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు గుర్తు తెలియని నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, ఈ విషయంలో విచారణ జరుగుతోందని ఎస్‌హెచ్ఓ ప్రవీణ్ మాలిక్ తెలిపారు.

## ఏపీలో 6 జిల్లాలకు రెడ్ అలర్ట్

**జయభేరి, విజయవాడ :**

కర్నూలు, నంద్యాల, పల్నాడు, ఎన్టీఆర్, పశ్చిమ, అల్లూరి జిల్లాలకు రెడ్ అలర్ట్. శ్రీకాకుళం, మన్యం, విజయనగరం, అల్లూరి జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు పడే అవకాశం. విశాఖ, అనకాపల్లి, కాకినాడ, తూ.గో, ప.గో, కోనసీమ, ఏలూరు, కృష్ణా, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశం. ఉందని వాతావరణం శాఖ తెలిపింది.

## తడిసి ముద్దయిన మైలవరం

**జయభేరి, మైలవరం :**

మైలవరం నియోజకవర్గ వ్యాప్తంగా వరుణుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం ధాటికి వాగులు,వంకలు పొంగిపొర్లుతున్నాయి.మైలవరంలో బుడమేరు ఉధృతంగా ప్రవహిస్తున్నది. రెడ్డిగూడెం మండలంలో వరద ఉధృతికి ఓబులాపురం,నరుకుళ్ళపాడు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. జి.కొండూరు మండలం హెచ్.ముత్యాలంపాడులో వంతెన పై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది.అదే విధంగా జి.కొండూరు మండలం సున్నంపాడు వద్ద రోడ్డు వరద ప్రవాహానికి గండి పడింది.సున్నంపాడు,తెల్లదేవరపాడు మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.వరద ఉధృతి కి రోడ్ల పై ప్రవహిస్తున్న వారికి ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా ముందస్తుగా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

## ఆగష్టు 5 న జడ్పీ సమావేశం

**జయభేరి, ఏలూరు :**

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు, జిల్లా ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ అధ్యక్షతన ఆగష్టు, 5వ తేదీ ఉదయం 10 గంటల నుండి జిల్లా ప్రజాపరిషత్ సమావేశపు హాలులో నిర్వహించడం జరుగుతుందని జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కె. రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజా పరిషత్ 1 నుండి 7వ స్థాయి సంఘ సమావేశాలు 5వ తేదీ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1. 30 ని.ల వరకు జరుగుతాయని, అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుండి జిల్లా ప్రజాపరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలియజేసారు. సమావేశాలలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించడం జరుగుతుందని, కావున సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా సమావేశాలకు హాజరు కావాలని ఆయన కోరారు.

## ట్రావెల్ బస్సులో భారీ చోరీ

**జయభేరి, నల్గొండ :**

నల్లగొండ జిల్లా నార్కట్ పల్లి శివారులోని పూజిత హోటల్ ముందు ఆగిన ఆరెంజ్ ట్రావెల్ బస్ లో భారీ చోరీ జరిగింది. ఒరిస్సా నుంచి హైదరాబాద్ వెళుతున్న ఒరిస్సాకు చెందిన వ్యాపారి నుంచి 28లక్షలు చోరీ చేసారు. టిఫిన్ కోసం హోటల్ ముందు బస్ ఆగింది. పిర్యాదు అందగానే పోలీసులు కేసు నమోదు చేసి సీసీ కెమెరాలు పరిశీలించారు.

## సచివాలయాన్ని ముట్టడించిన కానిస్టేబుల్ అభ్యర్థులు

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ సెక్రెటేరియట్ నుకానిస్టేబుల్ అభ్యర్థులు ముట్టడించారు. జీవో నెంబర్ 46ను రద్దు చేయాలని డిమాండ్ చేసారు. అభ్యర్థులు గేటు ముందు బైఠాయించారు. అందోళనకారులను పోలీసులు అరెస్టు చేసారు. ఇరువురికి తోపులాట, వాగ్వివాదం జరగడంతో ఉద్రిక్తత నెలకొంది. 2022 నోటిఫికేషన్ లో కానిస్టేబుల్ నియామకాల్లో తీసుకువచ్చిన జీవో నెంబర్ 46 రద్దు చేయాలని డిమాండ్ చేసారు. పాత పద్ధతిలో నియమాలను చేపట్టి... గ్రామీణ ప్రాంత విద్యార్థులకు న్యాయం చేయాలని... జీవో 46 వల్ల తీవ్రముగా నష్టపోతామని అన్నారు.

## మహిళా వైద్యురాలి హత్య

**జయభేరి, మచిలీపట్నం :**

కృష్ణ జిల్లా మచిలీపట్నంలో ఓ ప్రముఖ వైద్యురాలిని గుర్తుతెలియని దండగులు హత్య చేశారు. మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. మృతురాలు జవారుపేట లోని తల్లి పిల్లల ఆసుపత్రి లో పిల్లల వైద్యురాలు మాచర్ల రాధా. భర్త మాచర్ల లోకనాథ్, భార్యాభర్తలు ఇరువురు జవార్ పేటలోని తల్లి పిల్లల ఆసుపత్రి నడుపుతున్నారు. మంగళవారం సాయంత్రం క్రింది ఫ్లోర్ లోని క్లినిక్ కి వెళ్లిన భర్త లోకనాథ్. రాత్రి 11 గంటల సమయంలో ఎన్నిసార్లు ఫోన్ చేసినా డాక్టర్ రాధా స్పందించలేదు. అనుమానం వచ్చి భర్త లోక్ నాథ్ పైకి వెళ్లి చూడగా ఆమె రక్తపు మడుగులో పడివుంది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకుని బందర్ డీఎస్పి మాధవరెడ్డి, ఇనగుదురుపేట సిఐ ఉమామహేశ్వర రావు, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. దుండగులు డాక్టర్ రాధను హత్య చేసి నగలను వలుచుకు వెళ్లారు. భర్త నుండి వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బందరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## చర్లలో జనజీవనం అస్తవ్యస్తం

**జయభేరి, భద్రాచలం :**

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు భద్రాచలం ఏజెన్సీ చర్ల మండలంలో జన జీవనం అస్తవ్యస్తం అయిపోయింది. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఉంజుపల్లి వద్ద సీఆర్పీఎఫ్ క్యాంపు ను తాలిపేరు బ్యాక్ వాటర్ చుట్టుముట్టింది. చర్ల మండల కేంద్రంలో వీధులు చెరువును తలపిస్తున్నాయి. రానున్న ఇరవైనాలుగు గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయన్న వాతావరణ శాఖ సమాచారం తో అధికారులు అలెర్ట్ అయ్యారు. మండలంలోని ముంపు ప్రాంతాల్లో హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పర్యటించారు. తేగడ వద్ద తాలిపేరు వంతెన వద్ద వరద ప్రవాహం తీవ్రతను పరిశీలించారుర. గోదావరి పరివాహక ప్రాంతాల్లో గ్రామాలను సందర్శించి ప్రజలను అప్రమత్తంగా ఉండేలా చూడాలని అధికారులకు ఆదేశించారు.

# మోడీ సర్కార్ పై అవిశ్వాస తీర్మానం
## జత కలిసిన బీఆర్ఎస్

**జయభేరి, న్యూఢిల్లీ :**



మణిపూర్ హింసాకాండపై భగ్గుమన్న విపక్షాలు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు మొదలైనప్పటి నుంచి ఆందోళనలు చేస్తున్నాయి. ఈ క్రమంలోనే లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాసన తీర్మానం ప్రవేశపెట్టాయి. ఇండియా గా పేరు మార్చుకున్న విపక్ష కూటమి పూర్తి స్థాయిలో దీనిపై పోరాటం చేసేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగానే నోకాన్ఫిడెన్స్ మోషన్‌ని ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్, బీఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వరరావు ఈ తీర్మానాన్ని అందజేశారు. లోక్‌సభలోని కాంగ్రెస్ విప్ మాణికం ఠాగూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్రంపై పోరాడడానికి చివరి అస్త్రం ఇదే అని తేల్చి చెప్పారు. ఈ అవిశ్వాస తీర్మానానికి స్పీకర్ ఆమోదం తెలిపారు. దీనిపై మాణికం ఠాగూర్ స్పందించారు. ఇండియా కూటమి ఈ విషయంలో కలిసి పోరాడుతుందని తేల్చి చెప్పారు. "ఇండియా కూటమి కలిసే ఉంటుంది. లోక్‌సభలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని అంతా కలిసే నిర్ణయించుకున్నాం. ప్రధాని మోదీ గర్వాన్ని అణిచివేయాలన్నదే మా ఉద్దేశం. ఆయన వైఖరి అసలు బాగోలేదు. పార్లమెంట్‌కి రావడం లేదు. మణిపూర్‌పై ఒక్క స్టేట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదు. అందుకే...దీన్నే మా చివరి ఆయుధంగా మార్చుకున్నాం".

**మాణికం ఠాగూర్, కాంగ్రెస్ ఎంపీ**

అటు బీఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వరరావు కూడా దీనిపై స్పందించారు. ప్రధాని మోదీ మణిపూర్ హింసపై మాట్లాడితే దేశమంతా ప్రశాంతంగా ఉంటుందని అన్నారు. "మా పార్టీ తరపున ఈ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాం. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి మణిపూర్ హింసపై మాట్లాడాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఒకవేళ ప్రధాని మోదీ దీనిపై మాట్లాడి ఉంటే కొంత వరకైనా అలజడి తగ్గుతుంది. అందుకే...ఈ తీర్మానం ప్రవేశపెట్టాలని నిర్ణయించుకున్నాం".

**నామా నాగేశ్వరరావు, బీఆర్ఎస్ ఎంపీ**

ఈ అవిశ్వాస తీర్మానంపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ స్పందించారు. ఎలాంటి పరిస్థితులు వచ్చినా కేంద్రం చర్చించేందుకు సిద్ధంగా ఉందని తేల్చి చెప్పారు. "అవిశ్వాస తీర్మానం వస్తే రానివ్వండి. కేంద్రం అన్ని పరిస్థితులకూ సిద్ధంగానే ఉంది. సమావేశాలు ముగిసిపోకముందే సజావుగా మణిపూర్ హింసపై చర్చ జరగాలని మేమూ కోరుకుంటున్నాం. అందుకు మేం ఒప్పుకుంటున్నా కూడా వాళ్లు రూల్స్ గురించి గొడవ చేస్తున్నారు. ప్రధాని మోదీ వచ్చి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇవన్నీ కేవలం సభ సజావుగా సాగనీయకుండా చూసే సాకులు మాత్రమే" అర్జున్ రామ్ మేఘ్‌వాల్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి.

# మాట్లాడుతుంటే మైక్ కట్ చేస్తారా

**జయభేరి, న్యూఢిల్లీ :**



రాజ్యసభలో మాట్లాడుతుండగా మల్లికార్జున్ ఖర్గే మైక్‌ని ఆఫ్ చేయడంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "నా ఆత్మగౌరవాన్నే ప్రశ్నిస్తున్నారా" అంటూ మండిపడ్డారు. మణిపూర్ హింసాకాండపై ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంట్‌లో ప్రస్తావించకపోవడంపై విపక్షాలు భగ్గుమంటున్నాయి. వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి సభలు సజావుగా సాగడం లేదు. కచ్చితంగా దీనిపై చర్చ జరగాల్సిందేనని పట్టుపడుతున్నాయి విపక్షాలు. ఈ క్రమంలోనే మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతుండగా ఆయన మైక్ కట్ అయిందని ఆరోపించారు. ఖర్గే కామెంట్స్‌ని ఖండించిన బీజేపీ ఎంపీలు "మోదీ మోదీ" అనే నినాదాలతో హోరెత్తించారు. ఫలితంగా..చాలా సేపటి వరకూ సభలో గందరగోళం నెలకొంది. ఆ తరవాత సభ వాయిదా పడింది. ఎగువ సభలో ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉన్న ఖర్గే... తాను మాట్లాడుతుండగా మైక్ ఆఫ్ చేసి ప్రసంగాన్ని అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌కర్ పరిస్థితులు అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించినా అది సాధ్యం కాలేదు. ఇప్పటికే విపక్ష ఎంపీలు లోక్‌సభ, రాజ్యసభల్లో మణిపూర్‌పై చర్చ జరగాలని నోటీసులిచ్చారు. కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ వాయిదా తీర్మానాన్నీ ప్రవేశపెట్టారు. మణిపూర్‌పై చర్చ జరిగేంత వరకూ తమ ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఆ తరవాత డీఎమ్‌కే ఎంపీ తిరుచ్చి శివ, ఆర్‌జేడీ ఎంపీ మనోజ్ ఝా కూడా రూల్ 267 ప్రకార నోటీసులిచ్చారు. కాంగ్రెస్‌కి చెందిన రంజిత్ రంజన్, రాజీవ్ శుక్లా, ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా కూడా వాళ్లకు మద్దతుగా నిలిచారు. ప్రధాని మోదీ ఇండియా కూటమిని ఉగ్రవాదులు అని విమర్శించడంపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు ఖర్గే. "మమ్మల్ని ఉగ్రవాదులు అని అంటూనే సభ సజావుగా సాగేందుకు సహకరించాలని హోంమంత్రి అమిత్‌షా ఎలా అడుగుతున్నారు" అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ పార్లమెంట్‌లో మణిపూర్ హింసపై మాట్లాడాలని అమిత్‌షాకి లేఖ రాశారు ఖర్గే.మణిపూర్ హింసాకాండపై భగ్గుమన్న విపక్షాలు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు మొదలైనప్పటి నుంచి ఆందోళనలు చేస్తున్నాయి. ఈ క్రమంలోనే లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాసన తీర్మానం ప్రవేశపెట్టాయి. ఇండియా గా పేరు మార్చుకున్న విపక్ష కూటమి పూర్తి స్థాయిలో దీనిపై పోరాటం చేసేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగానే నో కాన్ఫిడెన్స్ మోషన్‌ని ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్, BRS ఎంపీ నామా నాగేశ్వరరావు ఈ తీర్మానాన్ని అందజేశారు. లోక్‌సభలోని కాంగ్రెస్ విప్ మాణికం ఠాగూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్రంపై పోరాడడానికి చివరి అస్త్రం ఇదే అని తేల్చి చెప్పారు.దీనిపై మాణికం ఠాగూర్ స్పందించారు. ఇండియాకూటమి ఈ విషయంలో కలిసి పోరాడుతుందని తేల్చి చెప్పారు.

# సిరుల పంటగా టమాటా

**జయభేరి, తిరుపతి :**





ప్రస్తుతం టమాటా పంట రైతులకు సిరులపంటగా మారింది. టమాటా తోట ఉన్నవారు ఉన్నపాటుగా కోటేశ్వరులైపోతున్నారు. మెదక్ జిల్లాలో మహిపాల్ రెడ్డి ఇప్పటికే రూ.2 కోట్ల విలువ చేసే టమాటాలను విక్రయించిన సంగతి తెలిసిందే. తాజాగా మరో రైతు నెల రోజుల్లోనే ఏకంగా రూ.3 కోట్ల ఆదాయం గడించాడు. చిత్తూరు జిల్లాకు చెందిన సోమల మండలం కరకమందకు చెందిన చంద్రమౌళి తన తమ్ముడు మురళి, తల్లి రాజమ్మతో కలిసి ఉమ్మడిగా వ్యవసాయం చేస్తున్నాడు. సొంతూరు కరకమందలో 12 ఎకరాలు, పులిచెర్ల మండలం సువ్వారపుపల్లెలో 20 ఎకరాల పొలం కలిగిన చంద్రమౌళి కుటుంబం ఏళ్ల నుంచి టమాటా సాగును పండిస్తోంది. ఈ క్రమంలోనే చంద్రమౌళి ఈ సారి కూడా తమ పొలంలో అదే పండను వేశారు.అంతే.. మార్కెట్‌లో కేజీ టమాట ధర రూ.150 నుంచి రూ.180 వరకు ఉండడంతో చంద్రమౌళి చేసిన 22 ఏకరాల టమాటా సాగు బంగారు పంటగా మారింది. జూన్, జూలై నాటికి పంట చేతికి వచ్చేలా సాగు చేయడం కలిసి వచ్చిందని చంద్రమౌళి చెబుతున్నారు. కట్టెసాగు విధానంలో మల్చింగ్, సూక్ష్మ సేద్య పద్ధతులు పాటించామని.. జూన్ చివరిలో దిగుబడి మొదలవ్వగా కర్ణాటకలోని కోలార్ మార్కెట్‌లో విక్రయించామని చంద్రమౌళి తెలిపారు. మార్కెట్‌లో 15 కిలోల టమాట బాక్స్ ధర రూ.వెయ్యి నుంచి రూ.1500 మధ్య పలికింది. ఈ క్రమంలో 40 వేల పెట్టెలను చంద్రమౌళి విక్రయించగా రూ. 4 కోట్లు ఆదాయం వచ్చిందని.. 22 ఎకరాలకు పెట్టుబడి రూపంలో రూ.70 లక్షలు కాగా, కమీషన్‌గా 20 లక్షలు, రవాణా ఖర్చులు 10 లక్షలు అయినట్లు తెలిపారు.మొత్తం ఖర్చులు పోగా చేతికి రూ.3 కోట్ల ఆదాయం వచ్చిందని చంద్రమౌళి అన్నారుజూన్, జులై నాటికి పంట చేతికి రావడంతో రైతు చంద్రమౌళి.. కర్ణాటక కోలార్ మార్కెట్‌లో విక్రయించాడు. 15 కిలోల టమాటా బాక్స్ ధర రూ. 1000 నుంచి రూ.1500 మధ్య పలికింది. రైతు చంద్రమౌళి 40 వేల పెట్టెలను విక్రయించగా దాదాపు రూ. 4 కోట్లు ఆదాయం వచ్చింది. 22 ఎకరాల్లో టమాటా సాగుకు పెట్టుబడికి రూ.70 లక్షలు, కమీషన్ రూ. 20 లక్షలు, రవాణా ఖర్చులు 10 లక్షలు ఖర్చు అయినట్లు చంద్రమౌళి తెలిపారు. సాగు ఖర్చులు పోగా రూ.3 కోట్ల మిగిలాయని ఆనందం వ్యక్తం చేశారు.మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని మొహమ్మద్ నగర్ కి చెందిన బాన్సువాడ మహిపాల్ రెడ్డి అనే రైతు తన 8 ఎకరాల్లో టమాటా పంట వేశాడు. సరిగ్గా టమాట ధరలు వంద రూపాయలకు కేజీ దాటే సమయానికి జూన్ 15 కి మహిపాల్ రెడ్డి పంట చేతికి వచ్చింది. ఈ నెల రోజుల సమయంలోనే ఈ రైతు సుమారుగా కోటి 90 లక్షల రూపాయలు సంపాదించాడు. జూన్ 15 నుంచి మొదలుకొని ఇప్పటివరకు, మహిపాల్ రెడ్డి సుమారుగా 7,000 క్రేట్ల టమాటాలను పఠాన్ చెరువు, బోయిన్ పల్లి, షాపూర్ మార్కెట్ లో కొనుగోలు చేశారు. ఒక్కో క్రేట్ లో 25 కేజీల టమాటాలు ఉంటాయి. సుమారుగా ఒక క్రేట్ ప్రస్తుతం రూ.2,600 ధర పలుకుతుందని చెబుతున్నారు రైతు మహిపాల్ రెడ్డి. ఇంకా తన పంటలో సుమారుగా 5,000 క్రేట్ల టమాటాలు పంట వస్తుందని అంచనా వేస్తున్నారు. ధర ఇలాగే ఉంటే వచ్చే నెలలో మరో కోటి కోటిన్నర వరకు ఆదాయం రావొచ్చు అని అంటున్నారు. సుమారుగా 20 సంవత్సరాలుగా కూరగాయలు పండిస్తున్నానని చెప్పిన మహిపాల్ రెడ్డి... తన జీవిత కాలంలో ఒక్క నెలలోనే ఇంత డబ్బుని ఎప్పుడు చూడలేదు అని సంతోషం వ్యక్తం చేశారు.



# చిరంజీవికి భారీ ఊరట

**జయభేరి, గుంటూరు :**

కొన్ని సంవత్సరాల క్రితం మెగాస్టార్ చిరంజీవిపై నమోదైన కేసు విషయంలో ఆయనకు భారీ ఊరట లభించింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆయనపై నమోదైన కేసును కొట్టేసింది. 2014 ఎన్నికల సమయంలో గుంటూరు నగరంలో మెగాస్టార్ చిరంజీవిపై కేసు నమోదైంది. అయితే, ఆయన కాంగ్రెస్ పార్టీ తరపున ఓ రాజకీయ సమావేశం నిర్వహించిన సందర్భంగా ఈ కేసు పెట్టారు. నిర్ణీత టైంలోపు మీటింగ్ పూర్తి చేయకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు వచ్చాయని ఆయనపై కేసు నమోదు అయింది. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని అప్పట్లో కాంగ్రెస్‌లో ఉన్న చిరంజీవిపై కేసు నమోదు చేశారు. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కొన్నాళ్ల క్రితం ఆయన ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌ను పరిశీలించిన హైకోర్టు ధర్మాసనం చిరంజీవిపై నమోదైన కేసును కొట్టేస్తూ ఆదేశాలు జారీ చేసింది.ఇటు చిరంజీవి బ్లడ్ బ్యాంక్ విషయంలో ప్రముఖ సినీ నటులు జీవిత, రాజశేఖర్ దంపతులకు ఇటీవల కోర్టు నుంచి గట్టి ఎదురుదెబ్బ తగిలిన సంగతి తెలిసిందే. న్యాయ స్థానం వారికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ గత వారం తీర్పును వెల్లడించింది. హైదరాబాద్ నాంపల్లిలోని 17వ అడిషనల్ చీఫ్ మెజిస్ట్రేట్ ఈ సంచలన తీర్పును వెల్లడించారు. చిరంజీవి బ్లడ్ బ్యాంక్ పై గతంలో వారు చేసిన ఆరోపణలకు సంబంధించి దాఖలైన పరువు నష్టం దావాపై విచారణ జరిపిన నాంపల్లి కోర్టు.. జీవిత, రాజశేఖర్ దంపతులకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.5 వేలు జరిమానా విధించింది.జీవిత, రాజశేఖర్ దంపతులు 2011లో చిరంజీవి బ్లడ్ బ్యాంకుపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మెగా స్టార్ గా తెలుగు సినీ అభిమానుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న చిరంజీవి, ప్రజల కోసం బ్లడ్ బ్యాంకుతో పాటు ఐ బ్యాంక్ ఏర్పాటు చేశారు. అవసరమైన వారికి రక్తం అందివ్వాలనే లక్ష్యంతో దీనిని నెలకొల్పారు. అప్పట్లో ఈ బ్లడ్ బ్యాంకుకు సినీ అభిమానులు మద్దతు తెలిపారు. ఎన్నో వేల మంది రక్త దానం చేశారు. ఆపదలో ఉన్న వారికి రక్త సాయం చేయాలని ఆకాంక్షించారు. అయితే, జీవిత, రాజశేఖర్ దంపతులు చిరంజీవి బ్లడ్ బ్యాంక్ మీద తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ బ్లడ్ బ్యాంక్ పేరుతో సినీ అభిమానుల రక్తాన్ని సేకరించి, డబ్బులకు అమ్ముకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు వాళ్లు ఏకంగా ఓ ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి మరీ, చిరంజీవి బ్లడ్ బ్యాంక్ గురించి తీవ్ర విమర్శలు చేశారు. అప్పట్లో ఈ ఆరోపణలు సంచలనం కలిగించాయి. చిరంజీవి రక్త నిధికి చాలా మంది రక్తం ఇచ్చేందుకు వెనుకాడారు.జీవిత, రాజశేఖర్ చిరంజీవి బ్లడ్ బ్యాంక్ మీద తీవ్ర ఆరోపణలు చేయడం పట్ల సినీ నిర్మాత, చిరంజీవి బావమరిది అయిన అల్లు అరవింద్ సీరియస్ అయ్యారు. ఈ మేరకు జీవిత, రాజశేఖర్ దంపతుల వ్యాఖ్యలపై న్యాయ స్థానాన్ని ఆశ్రయించారు. వారిపై పరువు నష్టం దావా వేశారు. చిరంజీవి గొప్ప మనసుతో చేస్తున్న మంచి కార్యక్రమం మీద బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారంటూ కేసు ఫైల్ చేశారు. 2011 నుంచి కొనసాగుతున్న ఈ కేసు విచారణ, తాజాగా ముగింపు దశకు వచ్చింది. మంగళవారం(జులై 18) నాడు ఈ కేసులో తుది తీర్పు వెల్లడి అయ్యింది. జీవిత రాజశేఖర్ దంపతులకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ. 5 వేలు జరిమానా విధిస్తూ నాంపల్లి కోర్టు తీర్పు చెప్పింది. జరిమానా చెల్లించడంతో అప్పీల్‌కు అవకాశం ఇచ్చింది. ఈ మేరకు జీవిత, రాజశేఖర్ దంపతులకు న్యాయ స్థానం బెయిల్ మంజూరు చేసింది.

## కేంద్రంపై విపక్షాలు అవిశ్వాస తీర్మానం నోటీసు

**జయభేరి, న్యూఢిల్లీ :**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఆగస్టు 11వ తేదీన ముగియనున్న విషయం తెలిసిందే. ఇక ఇవాళ లోక్‌సభలో విపక్ష పార్టీలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చించేందుకు కేవలం 13 రోజులు(వర్కింగ్ డేస్) మాత్రమే ఉన్నాయి. అయితే పద్ధతి ప్రకారం అవిశ్వాస తీర్మానంపై చర్చను షెడ్యూల్ చేసేందుకు లోక్‌సభ స్పీకర్ 10 రోజులు సమయాన్ని తీసుకునే వీలుంది. బీఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వరరావుతో పాటు కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గగోయ్..కేంద్రంపై అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చారు. సుమారు 50 మంది ఎంపీలు ఆ నోటీసులపై సంతకాలు చేసినట్లు తెలుస్తోంది. ఇవాళ లోక్‌సభ, రాజ్యసభల్లోనూ మణిపూర్ అంశంపై రభస కొనసాగింది. రెండు సభలను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత సమావేశమైన లోక్‌సభలో.. స్పీకర్ ఓం బిర్లా .. అవిశ్వాస తీర్మానంపై చర్చ చేపట్టేందుకు అనుమతి ఇచ్చారు. అవిశ్వాస తీర్మానాన్ని గగోయ్ సభలో ప్రవేశపెట్టారు. దానికి స్పీకర్ స్పందిస్తూ త్వరలో చర్చ తేదీ, సమయాన్ని వెల్లడించనున్నట్లు చెప్పారు. మణిపూర్ అంశంపై చర్చకు సిద్ధమే అని కేంద్రం అంటోంది, కానీ చర్చను తీసుకురావడం లేదని కాంగ్రెస్ ఎంపీ కే సురేశ్ తెలిపారు. ప్రధాని మోదీ సభకు రావడం లేదని, ఆయన తన చాంబర్‌లో కూర్చుంటున్నారని, కేవలం మీడియాతో మాత్రమే మాట్లాడుతున్నారని ఎంపీ సురేశ్ ఆరోపించారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు తమ వద్ద కావాల్సిన సంఖ్యా బలం ఉందన్నారు.బీఎస్పీ ఎంపీ మాలూక్ నగర్ లోక్‌సభలో మాట్లాడుతూ అవిశ్వాస తీర్మానం పై చర్చిస్తామన్నారు. మణిపూర్‌పై పూర్తి స్థాయిలో చర్చ జరుగుతుందన్నారు. సీఎంను మార్చాలని డిమాండ్ చేశామన్నారు. రాజస్థాన్‌లో దళితులపై జరుగుతున్న దాడులు, రేప్‌ల గురించి కూడా డిస్కర్ చేయాలన్నారు.

# హైదరాబాద్‌లో ఆస్ట్రేలియాతో టీ20, ఇంగ్లండ్‌తో టెస్టు

## వైజాగ్‌లోనూ టీమిండియా మ్యాచ్‌లు

ఆస్ట్రేలియాతో మూడు వన్డేలు.. ఇంగ్లండ్‌తో ఐదు టెస్టులు ఆడనుంది టీమిండియా. తాజాగా మంగళవారం (జులై 25) ఇండియా హోమ్ సీజన్ షెడ్యూల్ రిలీజ్ చేసింది బీసీసీఐ. హైదరాబాద్ లో ఓ టీ20, టెస్టు.. వైజాగ్ లో ఓ టీ20, టెస్ట్ జరగనున్నాయి. టీమిండియా బ్లాక్‌బస్టర్ హోమ్ సీజన్ షెడ్యూల్ రిలీజ్ చేసింది బీసీసీఐ. ఇందులో భాగంగా హైదరాబాద్, వైజాగ్ లకు కీలకమైన మ్యాచ్ ల ఆతిథ్యం దక్కింది. మంగళవారం (జులై 25) సాయంత్రం ఇండియా ఆడబోయే సిరీస్ లు, వేదికలను అనౌన్స్ చేసింది. 202324 సీజన్ కు సంబంధించిన షెడ్యూల్ ను బోర్డు రిలీజ్ చేసింది. ఈ హోమ్ సీజన్ లో భాగంగా టీమిండియా మొత్తం 16 మ్యాచ్ లు ఆడనుంది.

**ఆస్ట్రేలియాతో వన్డేలు.. ఇంగ్లండ్‌తో టెస్టులు**

ఈ మొత్తం 16 అంతర్జాతీయ మ్యాచ్ లలో ఇండియా 5 టెస్టులు, 3 వన్డేలు, 8 టీ20లు ఆడనుంది. ఐదుసార్లు వన్డే వరల్డ్ కప్ విజేత అయిన ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్ తో ఇండియా హోమ్ సీజన్ ప్రారంభమవుతుంది. ఐసీసీ వన్డే వరల్డ్ కప్ కు ముందు ఈ సిరీస్ జరగనుంది. ఇండియాలోనే అక్టోబర్, నవంబర్ లలో వరల్డ్ కప్ జరగనున్న విషయం తెలిసిందే. వరల్డ్ కప్ కు ముందు ఆస్ట్రేలియాతో మూడు వన్డేలు జరుగుతాయి. వరల్డ్ కప్ ముగిసిన తర్వాత అదే ఆసీస్ తో ఐదు టీ20ల సిరీస్ జరుగుతుంది. ఈ టీ20 సిరీస్ నవంబర్ 23న వైజాగ్ లో ప్రారంభం కానుండగా.. డిసెంబర్ 3న హైదరాబాద్ లో ముగుస్తుంది. ఇక 2024 ప్రారంభంలో ఆఫ్ఘనిస్థాన్ తో ఇండియా హోమ్ సిరీస్ ఆడనుంది.

ఆ టీమ్ తొలిసారి వైట్ బాల్ టోర్నమెంట్ కోసం ఇండియా రానుంది. ఇండియా, ఆఫ్ఘనిస్థాన్ మ్యాచ్ మూడు టీ20ల సిరీస్ జరుగుతుంది. ఈ మూడు మ్యాచ్ లు మొహాలి, ఇండోర్, బెంగళూరులలో జరుగుతాయి. ఇక ఆఫ్ఘన్ సిరీస్ ముగిసిన వెంటనే ఇంగ్లండ్ తో ఐదు టెస్టుల సిరీస్ ప్రారంభమవుతుంది. ఈ సిరీస్ జనవరి 25, 2024 నుంచి జరుగుతుంది. ఈ ఐదు టెస్టుల్లో భాగంగా తొలి టెస్టుకు హైదరాబాద్ ఆతిథ్యమివ్వనుండటం విశేషం. ఆ తర్వాత వైజాగ్, రాజ్‌కోట్, రాంచీ, ధర్మశాలల్లో మిగిలిన నాలుగు టెస్టులు జరుగుతాయి.



**ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల షెడ్యూల్**

తొలి టెస్ట్ జనవరి 25 నుంచి 29 (హైదరాబాద్), రెండో టెస్ట్ ఫిబ్రవరి 2 నుంచి 6 (వైజాగ్), మూడో టెస్ట్ ఫిబ్రవరి 16 నుంచి 20 (రాజ్‌కోట్), నాలుగో టెస్ట్ ఫిబ్రవరి 23 నుంచి 27 (రాంచీ), ఐదో టెస్ట్ మార్చి 7 నుంచి 11 (ధర్మశాల).

**ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ షెడ్యూల్**

తొలి వన్డే సెప్టెంబర్ 22 (మొహాలీ), రెండో వన్డే సెప్టెంబర్ 24 (ఇండోర్), మూడో వన్డే సెప్టెంబర్ 27 (రాజ్‌కోట్).

**ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్ షెడ్యూల్**

తొలి టీ20 నవంబర్ 23 (వైజాగ్), రెండో టీ20 నవంబర్ 26 (తిరువనంతపురం), మూడో టీ20 నవంబర్ 28 (గువాహటి), నాలుగో టీ20 డిసెంబర్ 1 (నాగ్‌పూర్), ఐదో టీ20 డిసెంబర్ 3 (హైదరాబాద్).



## అమెరికాలో ఆకలితో అలమటిస్తున్న హైదరబాదీ యువతి

### కాపాడాలని కోరుతున్న ఆ యువతి తల్లి

**జయభేరి, హైదరాబాద్:**

హైదరాబాద్ కు చెందిన ఒక యువతి అమెరికాలో ఆకలితో అలమటిస్తోంది. అనారోగ్యంతో, తన వస్తువులన్నీ పోగొట్టుకుని షికాగో వీధుల్లో ఒంటరిగా ఇబ్బంది పడుతోంది. ఆమెను ఆదుకుని, వెంటనే భారత్ కు తీసుకురావాలని భారత ప్రభుత్వాన్ని ఆ యువతి తల్లి కోరుతోంది. హైదరాబాద్ లోని మౌలాలీకి చెందిన యువతి సయ్యదా లులు మిన్హాజ్ జైదీ డెట్రాయిట్ లోని ట్రైన్ యూనివర్సిటీ లో ఎంఎస్ చేయడం కోసం 2021 లో అమెరికాకు వెళ్లింది. గత రెండు నెలలుగా ఆమె డిప్రెషన్, తదితర మానసిక సమస్యతో ఇబ్బంది పడుతోంది. ఆమె తన పేరును కూడా చెప్పలేకపోతోంది. ఆమెకు సంబంధించిన ఒక వీడియో ఇప్పుడు వైరల్ గా మారింది. బలహీనంగా కనిపిస్తున్న ఆమె తన పేరును కూడా వెంటనే చెప్పలేకపోవడం, మరో వ్యక్తి ఆమెకు ఆహారం అందించడం మొదలైన దృశ్యాలు ఆ వీడియోలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో తన కూతురు సయ్యదా లులు మిన్హాజ్ జైదీ ను కాపాడాలని, ఆమెను క్షేమంగా భారత్ తీసుకురావాలని ఆ యువతి తల్లి సయ్యదా వహాజ్ ఫాతిమా భారత ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తన కూతురు సయ్యదా లులు మిన్హాజ్ జైదీ 2021లో ఐటీలో ఎంఎస్ చేయడం కోసం యూఎస్ వెళ్లిందని, రెండు నెలల క్రితం వరకు ఆమె ఆరోగ్యంగానే ఉందని వెల్లడించారు. రెగ్యులర్ గా తమతో టచ్ లోనే ఉందని, కానీ రెండు నెలల నుంచి ఆమె నుంచి ఫోన్స్ రావడం ఆగిపోయిందని తెలిపారు. ఆమె డిప్రెషన్ తో బాధ పడుతోందని, తన వస్తువులను ఎవరో దొంగతనం చేయడంతో షికాగోలో రోడ్డున పడిపోయిందని అక్కడి ఇండియన్స్ తమకు చెప్పారని, అలాగే, తన కూతురుకు సంబంధించిన వీడియోను కూడా షేర్ చేశారని వెల్లడించారు. తన కూతురు డిప్రెషన్ తో బాధ పడుతోందని, ఆకలి, అనారోగ్యం వల్ల బలహీనంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే భారత ప్రభుత్వం పూనుకుని తన కూతురిని భారత్ తీసుకురావాలని ఆమె కోరుతున్నారు. ఆ తల్లి బాధను స్థానిక బీఆర్ ఎస్ నేత ఖలీఖర్ రెహ్మాన్ ఒక వీడియోలో రికార్డు చేశారు. ఆ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. తన కూతురును క్షేమంగా భారత్ తీసుకురావాలని ఆ తల్లి విదేశాంగ మంత్రి జైశంకర్ ను వేడుకుంటున్నట్లుగా ఆ వీడియోలో ఉంది.



# వరల్డ్ కప్‌లో ఇండియా..

## పాకిస్థాన్ మ్యాచ్ తేదీలో మార్పు

వరల్డ్ కప్‌లో ఇండియా, పాకిస్థాన్ మ్యాచ్ తేదీలో మార్పు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. షెడ్యూల్ ప్రకారం ఈ మ్యాచ్ అక్టోబర్ 15న అహ్మదాబాద్ లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరగనుంది. రానున్న వన్డే వరల్డ్ కప్ లో భాగంగా ఇండియా, పాకిస్థాన్ మ్యాచ్ అక్టోబర్ 15న అహ్మదాబాద్ లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరగాల్సి ఉంది. అయితే ఈ తేదీలో మార్పు జరగవచ్చనే వార్తలు వస్తున్నాయి. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ లో వచ్చిన రిపోర్టు ప్రకారం.. అక్టోబర్ 15 నవరాత్రుల్లో తొలి రోజు కావడంతో ఆ రోజును మార్చే అవకాశం ఉంది. గుజరాత్ లో చాలా ఘనంగా నిర్వహించే ఈ నవరాత్రి ఉత్సవాలతో ఈ మ్యాచ్ కు ఎలాంటి భద్రత ముప్పు రాకూడదన్న ఉద్దేశంతో ఈ మ్యాచ్ తేదీ మార్చాలని భావిస్తున్నట్లు ఆ రిపోర్టు వెల్లడించింది. ఇప్పటికే పలు ఏజెన్సీలు మ్యాచ్ ను రీషెడ్యూల్ చేయాల్సిందిగా బీసీసీఐని కోరినట్లు కూడా ఆ రిపోర్టు తెలిపింది. దీనిపై త్వరలోనే తుది నిర్ణయం తీసుకోనున్నట్లు బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించారు. "మాకున్న అవకాశాలపై చర్చిస్తున్నాం. త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం. ఇండియా, పాకిస్థాన్ లాంటి హై ప్రొఫైల్ మ్యాచ్ కోసం వేల మంది అభిమానులు అహ్మదాబాద్ కు వస్తారని, నవరాత్రి సమయంలో ఈ మ్యాచ్ జరగడం వల్ల ఇబ్బంది అవుతుందని భద్రతా ఏజెన్సీలు మాకు చెప్పాలి" అని ఓ బీసీసీఐ అధికారి అన్నట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ రిపోర్ట్ తెలిపింది. ఒకవేళ ఈ మ్యాచ్ రీషెడ్యూల్ చేస్తే మాత్రం చాలా ఇబ్బందే. సుమారు లక్ష మంది అభిమానులు ప్రత్యక్షంగా ఈ మ్యాచ్ చూడనున్నారు. ఇప్పటికే చాలా మంది అక్టోబర్ 15 కోసం అహ్మదాబాద్ లో వసతి కోసం హోటల్ రూమ్స్ బుక్ చేసుకున్నారు. అది కూడా సాధారణ ధరల కంటే పది రెట్లు ఎక్కువ చెల్లించారు. వీళ్లలో ఎన్నారైలు కూడా ఉన్నారు. ఇప్పుడు మ్యాచ్ మరో తేదీకి వాయిదా పడితే అన్ని వేల మంది ఒకేసారి ఆ బుకింగ్స్ రద్దు చేసుకోవాల్సి వస్తుంది. మరోవైపు ఇప్పటికీ ఈ మ్యాచ్ తోపాటు వరల్డ్ కప్ టికెట్ల అమ్మకాలపై బీసీసీఐ ఎలాంటి ప్రకటన జారీ చేయలేదు. దీనిపైనే అభిమానులు గుర్రుగా ఉన్నారు. ఇక ఇప్పుడు ఇండోపాక్ మ్యాచ్ వాయిదా వేస్తే వారి నుంచి బీసీసీఐకి మరిన్ని తిప్పలు తప్పవు. మరోవైపు వరల్డ్ కప్ కు ఆతిథ్యమిచ్చే అన్ని వేదికల సభ్యులను గురువారం (జులై 27) న్యూఢిల్లీలో సమావేశానికి రావాల్సిందిగా బీసీసీఐ సెక్రటరీ జై షా కోరారు. ఈ సమావేశంలోనే ఇండియా, పాకిస్థాన్ మ్యాచ్ పై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.






## పొత్తులపై కొనసాగుతున్న ప్రచారం

**జయభేరి, విజయవాడ :**

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, పవన్ హైదరాబాద్‌లో భేటీ అవుతారని రెండు పార్టీల శ్రేణుల నుంచి జోరుగా ప్రచారం జరుగుతోంది. ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశానికి జనసేనాని వెళ్లి వచ్చాక వీళ్లిద్దరూ కలవడంపై అనేక ఊహాగానాలు తెరమీదకు వస్తున్నాయి. అసలు టీడీపీ, బీజేపీ, జనసేన కలవాలనే వ్యూహం పవన్, చంద్రబాబుదా.. లేక జగన్, ఢిల్లీ పెద్దల గేమ్ ప్లాన్‌లో భాగమా అనేది స్పష్టత రావడం లేదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. సీఎం జగన్‌కు కేంద్ర పెద్దల సహకారం లేదనేట్లు వ్యవహరిస్తే చంద్రబాబు ఆలోచించే అవకాశముంటుంది. మూడు పార్టీలు కలిసి పోటీ చేసినా బీజేపీ మీద వ్యతిరేకత వల్ల టీడీపీ నష్టపోయే అవకాశాలున్నట్లు తమ్ముళ్లు చెబుతున్నారు. ఇంతకీ చంద్రబాబు ఎత్తుగడ ఏమిటనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. వారాహి యాత్ర ప్రారంభం నుంచి జనసేనాని చేస్తోన్న వ్యాఖ్యలు జగన్ వర్సెస్ పవన్ అనేట్లున్నాయి. ప్రధాన ప్రతిపక్షనేత చంద్రబాబు స్క్రిప్టునే పవన్ చదువుతున్నాడంటూ జగన్ వ్యూహాత్మకంగా కౌంటర్లు ఇస్తున్నారు. కొన్నిసార్లు పవన్ రెచ్చిపోయి చేసే ప్రసంగాలు టీడీపీని ఇరుకున పెట్టేట్లున్నాయి. ఇది అధికార పార్టీకి మేలు చేసేట్లున్నాయని తమ్ముళ్లలో ఆందోళన రేకెత్తించింది. సీఎం జగన్‌తో పాటు పార్టీ యంత్రాంగం మొత్తం పవన్‌ను టార్గెట్ చేయడం వెనుక ఢిల్లీ పెద్దల గేమ్ ప్లాన్ అయ్యుండొచ్చని అనుమానిస్తున్నారు. మరోవైపు టీడీపీని కూడా ఎన్డీయేలో చేర్చుకునే అవకాశముందని, బీజేపీ – టీడీపీ మధ్య కొంత గ్యాప్ ఉన్నట్లు సేనాని చెప్పుకొచ్చారు. ఇరు పార్టీల నేతలు చర్చించుకుంటే మూడు పార్టీలు కలిసి పోటీ చేసే అవకాశమున్నట్లు సేనాని అంటున్నారు.బీజేపీ అధినేతల ఎత్తుగడలు చూస్తుంటే టీడీపీని బలహీన పరిచేట్లున్నాయి. అందుకే పురందేశ్వరికి పార్టీ పగ్గాలు అప్పగించినట్లు తెలుస్తోంది. మరోవైపు అధికార పార్టీని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే విధంగా కేంద్ర పెద్దలు వ్యవహరించ లేదు. అందుకే చంద్రబాబు తొందరపడకుండా సంయమనం పాటిస్తున్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో మూడు పార్టీలు కలిసి పోటీ చేసినా వైసీపీకే గెలుపు అవకాశాలుంటాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. టీడీపీకి ముస్లిం, మైనార్టీలు దూరమవడమే గాకుండా రాష్ట్రానికి ద్రోహం చేసిన పార్టీగా ముద్ర వేసుకున్న బీజేపీ వల్ల డ్యామేజీ జరగొచ్చు. ఈ కలయిక వల్ల సేనానికి, బీజేపీకి పోయేదేమీ లేదు. నష్టమంతా టీడీపీకేనని తెలుగు తమ్ముళ్లు వాపోతున్నారు.టీడీపీ ముందు కేవలం రెండే ఛాయిస్‌లు ఉన్నాయి. బీజేపీ లేకుండా పవన్‌తో పొత్తు పెట్టుకోవడం. రెండోది బీజేపీ, జనసేనను వదిలేసి వామపక్షాలను కలుపుకొని పోటీ చేయడం. ఈ రెండింటిలో ఏదైనా సరే అధికార పార్టీని సమర్థవంతంగా ఢీ కొట్టగలదని పలువురు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అంతకుమించి మరేలాంటి నిర్ణయాలు తీసుకున్నా పార్టీని విజయతీరాలకు చేర్చడం కష్టమంటున్నారు. ఇంతకీ చంద్రబాబు, పవన్ భేటీ అయితే ఓ స్పష్టత వస్తుందా.. లేక సస్పెన్స్ మరికొంత కాలం కొనసాగుతుందా? అనేది రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

# ఐఏఎస్ అధికారి పాదయాత్ర

**జయభేరి, నెల్లూరు :**

ఐఏఎస్, ఐపిఎస్ అధికారులు రిటైర్ అయ్యాక రాజకీయాల్లో ప్రవేశించాలనుకోవడం ఇటీవలి కాలంలో సాధారణం అయిపోయింది. వారిలో కొందరిని మాత్రమే అదృష్టం వరిస్తోంది. రిటైర్మెంట్ తర్వాత పొలిటికల్ కెరీర్‌లో కొత్త ఇన్నింగ్స్ మొదలు పెట్టాలి అనుకున్న రిటైర్డ్ అధికారి కూడా ఏపీలో పాదయాత్ర ప్రారంభించారు.ఐఏఎస్, ఐపిఎస్ అధికారులు రిటైర్ అయ్యాక రాజకీయాల్లో ప్రవేశించాలనుకోవడం ఇటీవలి కాలంలో సాధారణం అయిపోయింది. వారిలో కొందరిని మాత్రమే అదృష్టం వరిస్తోంది. రిటైర్మెంట్ తర్వాత పొలిటికల్ కెరీర్‌లో కొత్త ఇన్నింగ్స్ మొదలు పెట్టాలి అనుకున్నఓ ఐఏఎస్ అధికారి ఏపీలో పాదయాత్ర ప్రారంభించారు. తడ నుంచి తుని వరకు చేపట్టిన ఈ యాత్ర ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడైన ఐఏఎస్ అధికారి పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. రిటైర్మెంట్ తర్వాత కూడా ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్న జీఎస్‌ఆర్‌కె విజయ్‌కుమార్ ఐక్యతా విజయపథం పేరుతో పేదల సమస్యలు తెలుసుకోడానికి పాదయాత్ర బాట పట్టారు.రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్ చేపట్టిన యాత్ర వెనుక ఉద్దేశాలపై రాజకీయ పార్టీలతో పాటు అధికార వర్గాల్లో కూడా ఆసక్తి నెలకొంది.ఏ విషయంలో అంతా తానై వ్యవహరించడానికి ఇష్టపడే ఐఏఎస్ అధికారుల్లో ఒకరైన విజయ్‌కుమార్ పేదలు ఎదుర్కొంటున్న సమస్యలు, స్థితిగతులను గ్రామాల వారీగా తెలుసుకోవడానికే యాత్ర చేపట్టినట్టు చెబుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లైనా పేదలకు చేయాల్సింది చాలా ఉందని, పేదలకు ఏమి చేయాలనేది తెలుసుకోడానికి ఈ యాత్రను చేపట్టినట్టు చెబుతున్నారు. మూడు దశల్లో తాను యాత్ర చేస్తున్నట్లు తెలిపారు. మొదట తడ నుంచి తుని వరకు యాత్రను ప్రారంభించి, రాయలసీమ, ఏజెన్సీ ప్రాంతాల్లో తర్వాతి దశల్లో పర్యటిస్తానని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పేద వర్గాలను కలిసి సాంఘిక, ఆర్థిక సమానత్వం కోసం ప్రయత్నించాలన్నది తన ఉద్దేశమన్నారు. వివక్ష లేని సమాజాన్ని నెలకొల్పడమే తన లక్ష్యమని విజయ్‌కుమార్ ప్రకటించారు. పేదరికం పై విజయం సాధించే లక్ష్యంతో



ఐక్యతా విజయ పథం యాత్ర చేపట్టినట్టు విజయ్ కుమార్ తెలిపారు.బహు ముఖాలు కలిగిన పేదరికాన్ని అర్థం చేసుకునే దిశగా ప్రజలను కలిసేందుకు తడ నుంచి తుని వరకు చేపట్టానని ప్రకటించారు. పేదల విజయం కోసం వివేకం పేరుతో యాత్ర చేపతున్నామని వెల్లడించారు. పేదల ప్రాతినిధ్యంతోనే సమూలంగా పేదరికాన్ని నిర్మూలన చెయ్యొచ్చని చెబుతున్నారు.అధికారంలో ఉన్న సమయంలో ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితంగా మెలిగిన ఐఏఎస్ అధికారుల్లో ఒకరైన విజయ్‌కుమార్, సిఎం అమోదం, అనుమతితోనే యాత్ర ప్రారంభించినట్లు ప్రచారం జరుగుతోంది. బ్యూరోక్రాట్ వర్గాల్లో ఏ టూ జడ్ ఆఫీసర్‌గా ఆయన గుర్తింపు పొందారు. పనిచేసే చోట చొరవగా ఉండటంతో పాటు తన కనుసన్నల్లోనే వ్యవహారాలు నడపాలనే తీరుతో ఆయనకు ఆ గుర్తింపు వచ్చింది.ఎన్నికలకు ముందు ఐఏఎస్ అధికారి యాత్ర చేపట్టడంపై రకరకాల సందేహాలు ఉన్నాయి. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల్లో ప్రభుత్వంపై ఉన్న అభిప్రాయాన్ని తెలుసుకోవడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు చెబుతున్నారు. విజయ్‌కుమార్ 2020లోనే వివేకం పేరుతో ఓ ఎన్జీవోను ఏర్పాటు చేశారు. ఆయన సతీమణి ద్వారా ఆ సంస్థ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సొంత సంస్థను ఏర్పాటు చేసినా, రిటైర్మెంట్ తర్వాత కూడా ఆయన సిఎంఓలో కీలక బాధ్యతల్లో కొనసాగారు. ఏపీలో విమర్శల్ని ఎదుర్కొన్న జిల్లాల పునర్విభజన మొత్తం ఆయన కనుసన్నల్లోనే జరిగింది.తాజా యాత్ర ద్వారా ప్రజల్లో నాయకుడిగా గుర్తింపు పొందడంతో పాటు ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలను తెలుసుకునే అవకాశం ఉండటంతోనే యాత్ర చేపట్టినట్టు కనిపిస్తోంది. స్వామికార్యంస్వకార్యం నెరవేరేఅవకాశాలుండటంతో రాష్ట్ర వ్యాప్తంగా యాత్రను నిర్వహించేందుకు సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. యాత్ర ద్వారా సేకరించే వివరాలతో కొత్త సంక్షేమ పథకాలకు రూపకల్పన చేయొచ్చని అధికార వర్గాల్లో చర్చ నడుస్తోంది. ప్రధానంగా ఏపీలో అధికార పార్టీకి ఓటు బ్యాంకులుగా ఉన్న వర్గాలను ఆకట్టుకునేలా కొత్త పథకాల రూపకల్పన చేసే లక్ష్యంతోనే పాదయాత్ర చేస్తున్నట్లు చెబుతున్నారు. ఎన్నికలకు ముందు ప్రకటించే మ్యానిఫెస్టోలో స్థానం దక్కించుకునేలా కొత్త స్కీములకు శ్రీకారం చుట్టేందుకే ఈ కసరత్తు చేస్తున్నారని చర్చ నడుస్తోంది.ఇటీవల విజయవాడలో నిర్వహించిన సమావేశంలో 2019 తర్వాత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు తొలగించిన సంక్షేమ పథకాలపై పలు ప్రశ్నల్ని విజయ్‌కుమార్ ఎదుర్కోవాల్సి వచ్చింది. విద్యా, ఉపాధి పథకాలను రద్దు చేయడంపై అయా సంఘాల నుంచి నిరసన ఎదుర్కోవాల్సి వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించడం ద్వారా అయా సామాజిక వర్గాలను మచ్చిక చేసుకోడానికి అవసరమయ్యే ప్రణాళికను రూపొందించడం కూడా వ్యూహమై ఉంటుందనే సందేహాలు ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా యాత్రను నిర్వహించేందుకు కావాల్సిన వనరులు, సదుపాయాలు ఎవరు కల్పిస్తున్నారనే సందేహాలు కూడా ఉన్నాయి.

## ఎగిసిపడుతున్న అసంతృప్త జ్వాలలు

**జయభేరి, విజయవాడ :**

ఆంధ్రప్రదేశ్ అధికార పార్టీ వైఎస్ఆర్‌సీపీలో వర్గ విభేధాలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. గతంలోనే సీఎం జగన్ సీటు ఫలానా వారికేనని తేల్చేసి అందరి ముందూ సమస్యకూ పరిష్కారం చూపించేసినా ఇప్పుడు కొంత మంది నేతలు తెరపైకి వస్తున్నారు. అవసరమైతే పార్టీ పదవులకు రాజీనామా చేస్తామంటున్నారు కానీ తగ్గడం లేదు. ఇలాంటివి చాలా నియోజకవకర్గాల్లో ప్రారంభమయ్యాయి. వీటికి మొదట్లోనే చెక్ పెట్టాలని వైసీపీ వ్యూహకర్తలు ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో ఇలాంటివి పెరిగిపోతున్నాయి. వైసీపీలో అభ్యర్థుల్ని సీఎం జగన్ దాదాపుగా ఖరారు చేస్తూ వస్తున్నారు. అలాగే రామచంద్రాపురంలో అభ్యర్థిగా మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను ఖరారు చేశారు. మొదట్లో పెద్దగా స్పందించని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ ఇప్పుడు ఇండిపెండెంట్ గా అయినా పోటీ చేస్తానని చెబుతున్నారు. జగన్ కూడా అదే చెప్పానంటున్నారు. మీడియాకెక్కి మాట్లాడటం క్రమశిక్షణ ఉల్లంఘన కిందకే వస్తుందని పార్టీ అధిష్టానం భావిస్తోంది. స్వయంగా తానే పిలిచి మాట్లాడి పంపిన తరువాత అక్కడ బజారుకెక్కడంపట్ల అధినేత తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తంచేశారని సమాచారం. ఇప్పటికిప్పుడు నిర్ణయం తీసుకోవడానికి అక్కడ ఒకవైపు అధినేత కుటుంబానికి విధేయుడిగా ఉంటూ పార్టీ ఆవిర్భావం నుండి ఆయనతో నడిచిన వ్యక్తి ఒకరైతే, తానే టిక్కెట్టు ఇచ్చి, ఎమ్మెల్యేనుచేసి మంత్రిని చేసిన వ్యక్తి మరొకరు. అదే సమయంలో గన్నవరం పంచాయతీ తెరపైకి వచ్చింది. వచ్చే ఎన్నికల్లో గన్నవరం నుంచి తానే పోటీ చేస్తున్నానని యార్లగడ్డ వెంకట్రావు ప్రకటించారు. నిజానికి ఇక్కడ కూడా టిక్కెట్ వంశీకేనని..జగన్ గతంలోనే చెప్పారు. కానీ యార్లగడ్డ వెంకట్రావు ఇప్పుడు తెరపైకి వచ్చారు. ఇలా నందికొట్కూరు, నగరి, సత్తెనపల్లి ఇలా చెప్పుకుంటూ పోతే కనీసం యాభై నియోజకవర్గాల్లో వర్గ పోరు ఉందని వైఎస్ఆర్‌సీపీ వర్గాలు చెబుతున్నాయి. పిల్లి సుభాష్, చెల్లుబోయిన వేణుల మధ్య వ్యవహారం మీడియాకు ఎక్కడం.. గన్నవరం యార్లగడ్డ వెంకట్రావూ అదే పని చేయడంతో వైసీపీ అధినాయకత్వం అలర్ట్ అయింది. ఎవరైనా పార్టీ అంతర్గత వ్యవహారాలపై మీడియాతో మాట్లాడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరికలు పంపింది. రాష్ట్రంలో గ్రూపిజం నడుస్తున్న పలు నియోజక వర్గాలపై కూడా అధిష్టానం సీరియస్‌గా ఫోకస్ పెట్టింది. ఎక్క డెక్కడ సమస్య సున్నితంగా ఉందో అక్కడ ముందుగా ఒక నిర్ణయం తీసుకుని తేల్చేయాలని అనుకుంటోంది. ఇటీవల కొన్ని నియోజకవర్గాల్లో పార్టీ నేతలను సస్పెండ్ చేయడం చేశారు. ఇలాంటి వాటికీ కూడా వెనుకాడబోమని హెచ్చరికలు హైకమాండ్ పంపుతోంది. ఇప్పటికే ఏపీ జిల్లాల్లో ఎవరెవరి మధ్య గ్రూపిజం నడుస్తుందన్న దానిపై పక్కా సమాచారాన్ని చేతిలో పట్టుకున్న పార్టీ ఆధినేత, ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఆచితూచి అడుగులేయాలని నిర్ణయం తీసుకున్నారు. మాజీ మంత్రి, ఒంగోలు శాసనసభ్యుడు బాలినేని శ్రీనివాస రెడ్డితో పార్టీ అనుబంధ విభాగాల ఇన్‌ఛార్జి, రాజ్యసభ సభ్యుడు వేణుంబాక విజయసాయి రెడ్డి భేటీ అయ్యారు. ఎంపీ విజయసాయి స్వయంగా బాలినేని ఇంటికి వెళ్లి గంటకుపైగా చర్చలు జరిపారు. అధిష్టానం చెప్పిన పలు అంశాలను ఆయనకు వివరించారు. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్తగా గతంలో చేసిన రాజీనామాను ఉపసంహరించుకుని పార్టీ కార్యక్రమాల్లో యాక్టివ్ కావాలని సూచించినట్లు తెలిసింది. ఇలా బుజ్జగించాల్సిన వాళ్లు ఎవరైనా ఉంటే.లిస్ట్ రెడీ చేసుకుని పార్టీ నాయకుల్ని వారి వద్దకు పంపుతున్నారు.

జయభేరి సినిమా

## ఇంట్రెస్టింగ్ గా "ప్రతినిధి 2" కాన్సెప్ట్ టీజర్.!



మన టాలీవుడ్ లో కాస్ట్ గ్యాప్ తీసుకున్నా కూడా పలు డిఫరెంట్ సబ్జెక్టులు చేసే దర్శకులు గాని నటులు గాని చాలా తక్కువమందే ఉంటారు. మరి అలాంటి నటుల్లో అయితే హీరో నారా రోహిత్ కూడా ఒకరు. మరి తాను ఇప్పటివరకు చేసిన చిత్రాలు అన్నీ డిఫరెంట్ కాన్సెప్ట్ లతోనే చేయగా వాటిలో తాను చేసిన ప్రతినిధి చిత్రం సెన్సేషన్ హిట్ అయ్యింది. ఇక మళ్ళీ ఇన్నాళ్ళకి ఈ చిత్రానికి మేకర్స్ రీసెంట్ గా రోహిత్ బర్త్ డే కానుకగా అయితే అనౌన్స్ చేసి ఓ కాన్సెప్ట్ పోస్టర్ ని కూడా రిలీజ్ చేయగా దానికి మంచి రెస్పాన్స్ వచ్చింది. అయితే దీని తర్వాత రిలీజ్ చేసిన కాన్సెప్ట్ టీజర్ మరింత ఆసక్తిభరితంగా ఉందని చెప్పాలి. మరోసారి ఓ ఇంట్రెస్టింగ్ పొలిటికల్ డ్రామాని అయితే మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్టుగా ఈ టీజర్ లో పలు అంశాలు చూస్తే అర్ధం అవుతుంది. మరి ఈ చిత్రాన్ని మూర్తి దేవగుప్తు దర్శకత్వం వహిస్తుండగా మహతి సాగర్ సంగీతం అందిస్తున్నాడు. అలాగే వానర ఎంటర్టైన్మెంట్స్ వారు నిర్మాణం వహిస్తున్నారు.




## బాలి జిమ్ క్లబ్ లో సామ్ అదిరిపోయే స్టంట్స్..

టాలీవుడ్ స్టార్ నటి సమంత.. ఏడాది పాటు సినిమాలకు బ్రేక్ ఇవ్వనున్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఇందుకోసం తన చేతిలో ఉన్న ప్రాజెక్టులను సైతం పూర్తి చేసింది. గత కొన్ని రోజులుగా మయోసైటిస్ తో బాధపడుతున్న సామ్.. తన సమయాన్ని వ్యక్తిగత, ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని నిర్ణయించుకుందట. తన తదుపరి ట్రీట్ మెంట్ కోసం అమెరికా వెళ్లాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా, ప్రస్తుతం సామ్.. ఇండోనేషియాలోని బాలికి వెకేషన్ కోసం వెళ్లిన విషయం తెలిసిందే. ఇటీవలే తన స్నేహితులతో కలిసి బాలి ట్రిప్ కు వెళ్లింది. ఈ సందర్భంగా అక్కడ జిమ్ క్లబ్ లో వర్కౌట్ చేస్తున్న వీడియోను తాజాగా ఇన్ స్టా స్టోరీస్ లో పోస్టు చేసింది. వీడియోలో సామ్ ఓ వ్యక్తిని తన చేతులు, కాళ్ల సాయంతో గాల్లో నిలబెడుతూ కనిపించింది. సమంత స్టంట్ వీడియో చూసిన నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. ప్రస్తుతం ఈ వీడియో బాగా వైరల్ అవుతోంది.

## టూ పీస్ లో రకుల్ అందాల దాడి! రకుల్ ప్రీత్ సింగ్ హాటెస్ట్ సెన్సేషన్

రకుల్ ప్రీత్ సింగ్ హాటెస్ట్ సెన్సేషన్ గురించి చెప్పాల్సిన పనిలేదు. సెగలు పుట్టించే అందాలతో కుర్రాళ్లకు నిదుర లేకుండా చేస్తుంది. అమ్మడు వెకేషన్ కి వెళ్లిందంటే? బికినీ ట్రీట్ తప్పనిసరి. వైవిధ్యమైన భంగిమల్లో కెమెరా ఫోజులు నెట్టింట కాక పుట్టిస్తాయి. తాజాగా అమ్మడు దుబాయ్ వెకేషన్ లో ఉంది. స్టార్ హోటల్ బస చేసిన బ్యూటీ... ప్రయివేట్ బీచ్ లో అందాల దాడితో మళ్లీ తెగబడింది. టూపీస్ బికినీలో మంటలు పుట్టించే బాధ్యత తీసుకుంది. లేలేత చిలకాకు పచ్చ పీసుల్లో రకుల్ సెగలు పుట్టించే భంగిమలతో ఆకట్టుకుంటుంది. నియాన్ షర్ట్ తో గ్లామ్ ను కవర్ చేసింది. బీచ్ లో ఎగ్జోటిక్ లొకేషన్లలో అందాలన్ని ధారళంగా ఆరబోసింది. అమ్మడు స్కిన్ టోన్ తళతళలాడిపోతుంది. రకుల్ స్పైసీ ట్రీట్ కి కుర్రాళ్లంతా ఫిదా అవుతున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అమ్మడి అందాలపై కామెంట్లు అంతే ఆసక్తికరం. ఇలాంటి బికినీ భంగిమలు రకుల్ కి కొత్తేం కాదు. రకుల్ ఎప్పుడు వెకేషన్ కి వెళ్లినా టూపీస్.. స్విమ్ షూట్ లోకి దూరిపోతుంది. వాటిని ఇన్ స్టాలో షేర్ చేసి కుర్రాళ్ల అటెన్షన్ డ్రా చేస్తుంది. ఆ ఫోటోలపై వచ్చే కామెంట్లను అంతే ఆస్వాదిస్తుంది.

Also Read ఈషా కిల్లింగ్ లుక్స్..! వర్క్ ఫ్రంట్‌లో రకుల్ బాలీవుడ్‌లో రెండు సినిమాలు చేస్తోంది. అలాగే అమ్మడు శివ కార్తికేయన్ కి జంటగా ఓ సూపర్ హీరో చిత్రంలోనూ నటిస్తోంది. మరోవైపు విశ్వనటుడు కమల్ హాసన్ తోనూ తెరను పంచకుంటోంది. ఆయనకు జోడీగా 'ఇండియాన్ 2'లో నటిస్తోంది. సొగసరికి మళ్లీ టాలీవుడ్ లో అవకాశాలు వస్తున్నాయని ప్రచారం సాగుతోంది. అయితే అమ్మడి ఫోకస్ అంతా హిందీ సినిమాలపైనే ఉంది. మరోవైపు ప్రియుడు జాకీ భగ్నానీతో పీకల్లోతు ప్రేమలోనూ మునిగి తేలుతోన్న సంగతి తెలిసిందే.



## రమ్యకృష్ణ కుమారుడితో కలిసి శ్రీవారిని దర్శనం

ప్రముఖ నటి రమ్యకృష్ణ తిరుమల కొండపై సందడి చేశారు. తన కుమారుడితో కలిసి ఏడుకొండల వాడిని దర్శించుకున్నారు. రమ్యకృష్ణతో సెల్ఫీలు దిగేందుకు కొంత మంది ఆసక్తి కనబరిచారు. తిరుమల శ్రీవేంకటేశ్వరుడిని ప్రముఖ నటి రమ్యకృష్ణ దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం స్వామివారి నైవేద్య విరామ సమయంలో కుమారుడు రిత్విక్ వంశీతో కలిసి రమ్యకృష్ణ శ్రీవారి దర్శనం చేసుకున్నారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో రమ్యకృష్ణ, రిత్విక్‌లకు వేద పండితులు వేద ఆశీర్వాదం అందించారు. ఆలయ అధికారులు పట్టు వస్త్రంతో సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయం వెలుపలకు వచ్చిన రమ్యకృష్ణతో ఫొటోలు, సెల్ఫీలు దిగేందుకు కొంత మంది ఆసక్తి కనబరిచారు. అయితే, రమ్యకృష్ణ మాత్రం కాస్త ఇబ్బంది పడినట్టు కనిపించారు.

**కృష్ణవంశీతో పెళ్లి**

ఐదు భాషల్లో 260కి పైగా సినిమాల్లో నటించిన రమ్యకృష్ణ.. 2003లో ప్రముఖ దర్శకుడు కృష్ణవంశీని పెళ్లిచేసుకున్నారు. 2003 జూన్ 12న వీరి వివాహం జరిగింది. ఈ దంపతులకు రిత్విక్ వంశీ ఒక్కడే సంతానం. చెన్నైలో నివాసం ఉండే రమ్యకృష్ణ.. కుమారుడు రిత్విక్‌ను ఎప్పుడూ పెద్దగా హైలైట్ చేయరు. సోషల్ మీడియాలో సైతం కుమారుడు గురించి పెద్దగా పోస్టులు పెట్టరు. కాకపోతే ఇప్పుడు ఏడుకొండలవాడి దర్శనం కోసం ఆమె తిరుమల తీసుకొచ్చారు. అయితే, తిరుమల కొండపై తనను, తన తల్లికి కెమెరాల్లో బంధిస్తుంటే రిత్విక్ కాస్త ఇబ్బంది పడ్డాడని, ఒక వ్యక్తి మీదికొచ్చి ఫొటోలు తీస్తుంటే కెమేరాను పక్కకు తోసేశాడని స్థానిక మీడియా రిపోర్టర్ ఒకరు వెల్లడించారు.

**15 ఏళ్లకే హీరోయిన్**

1970 సెప్టెంబర్ 15న చెన్నైలో జన్మించిన రమ్యకృష్ణ.. ప్రముఖ తమిళ నటుడు, ఎంపీ చో రామస్వామికి సమీప బంధువు. చిన్న వయసులోనే కూచిపూడి, భరతనాట్యంతో వెస్టరన్ డాన్స్ కూడా నేర్చుకున్న రమ్యకృష్ణ ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు. ఇక 15 ఏళ్ల వయసులోనే సినిమా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. ఆమె నటించిన తొలి చిత్రం 'నీరం పులరుంబోల్' (మలయాళం). కాకపోతే ఈ సినిమా విడుదల ఆలస్యమైంది. దీని కంటే ముందు 1985లో 'వెల్లాయి మనసు' అనే తమిళ సినిమా విడుదలైంది. ఇక తెలుగులో రమ్యకృష్ణ హీరోయిన్‌గా నటించిన మొదటి చిత్రం 'భలే మిత్రులు'. 1986లో ఈ సినిమా విడుదలైంది. కెరీర్ ప్రారంభం నుంచే తెలుగు, తమిళ భాషల్లో రమ్యకృష్ణ బాగా బిజీ అయిపోయారు. కె.బాలచందర్, కె.విశ్వనాథ్, కె.రాఘవేంద్రరావు, దాసరి నారాయణరావు లాంటి దిగ్గజ దర్శకులతో పనిచేశారు. అయితే, సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా కె.యస్.రవికుమార్ దర్శకత్వంలో వచ్చిన 'పడయప్ప' (నరసింహ) సినిమాతో రమ్యకృష్ణ స్టార్ స్టేటస్ పెరిగిపోయింది. ఈ సినిమాలో నీలాంబరి పాత్రలో రమ్యకృష్ణ నట విశ్వరూపం చూపించారు. నిజానికి ఈ సినిమా కంటే ముందే తెలుగులో చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్, నాగార్జున లాంటి స్టార్ హీరోల సరసన రమ్యకృష్ణ నటించారు. అలాగే, కోడి రామకృష్ణ దర్శకత్వంలో వచ్చిన 'అమ్మోరు' సినిమాలో అమ్మవారి పాత్రలో జీవించారు. కానీ, నీలాంబరి పాత్ర ఆమెను నటిగా మరో మెట్టు ఎక్కించింది. అప్పటి నుంచీ ఆమెకు లేడీ ఓరియెంటెడ్ మూవీస్ ఎక్కువగా వచ్చాయి. ఇక ఆమె క్యారెక్టర్ ఆర్టిస్టుగా సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టాక 'బాహుబలి'లో శివగామి పాత్ర జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిపెట్టింది. సెకండ్ ఇన్నింగ్స్‌కు ఊపు తీసుకొచ్చింది.



## శేఖర్ కమ్ముల రేంజ్ మారింది..
## ధనుష్, నాగార్జునతో భారీ బడ్జెట్ చిత్రం!

టాలీవుడ్ దర్శకుల్లో శేఖర్ కమ్ముల స్టైలే వేరు. కమర్షియల్ హంగులు లేకుండా సహజత్వానికి దగ్గరగా సినిమాలు తెరకెక్కించడంలో ఆయన మాస్టర్ అని చెప్పొచ్చు. ప్రస్తుతం ఆయన కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్‌తో ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ మూవీ స్క్రిప్ట్, కాస్టింగ్‌కు సంబంధించిన డీటెయిల్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. కమర్షియల్ ఫార్మాట్ కంటే కథ, కంటెంట్‌కే ప్రాధాన్యతనిచ్చే దర్శకుల్లో శేఖర్ కమ్ముల ఒకరు. కెరీర్ మొదటి నుంచి ఇదే తరహాలో సినిమాలు చేస్తూ వస్తున్న ఈ స్టార్ డైరెక్టర్.. 'ఫిదా, లవ్‌స్టోరీ' చిత్రాలతో స్టార్ డైరెక్టర్ అయిపోయాడు. స్టార్ హీరోలు, కాంబినేషన్లు, భారీ బడ్జెట్ కాలిక్యులేషన్స్.. ఇవేం లేకుండా హిట్ మూవీస్ రూపొందించిన ఆయన తొలిసారి భారీ బడ్జెట్ మూవీకి సిద్ధమవుతున్నాడు. ఇటీవలే 'సార్' మూవీతో తొలిసారి స్ట్రెయిట్ తెలుగు ఫిల్మ్‌లో నటించిన కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్‌తో శేఖర్ కమ్ముల ఓ చిత్రానికి కమిటైన సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని పాన్ ఇండియా రేంజ్‌లో తెరకెక్కిస్తున్నట్లు తాజా సమాచారం. మరో టాలీవుడ్ హీరో ఇందులో కీలక పాత్రలో నటిస్తున్నట్లు టాక్. సాధారణంగా శేఖర్ కమ్ముల చిత్రాల్లో కథా బలం ఎక్కువ. ఇక ధనుష్‌తో మొదలవనున్న మూవీ విషయానికొస్తే.. కేవలం స్క్రిప్ట్ కోసమే శేఖర్ కమ్ముల రెండేళ్లు వర్క్ చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో



కింగ్ నాగార్జున కీలక పాత్ర పోషించనుండగా.. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ అందించనున్నారు. మొత్తానికి ఇప్పటి వరకు మీడియం రేంజ్ బడ్జెట్ చిత్రాలనే తెరకెక్కించిన శేఖర్ కమ్ముల.. తొలిసారి పాన్ ఇండియా మూవీకి దర్శకత్వం వహించనున్నారు. ఇక ఈ చిత్రంలో నేషనల్ క్రష్ రష్మిక మందనను హీరోయిన్‌గా తీసుకునేందుకు చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం రష్మిక.. రణబీర్ కపూర్‌తో యానిమల్ మూవీతో పాటు అల్లు అర్జున్ సరసన 'పుష్ప 2' చిత్రంలో నటిస్తోంది. తెలుగులో నితిన్, వెంకీ కుడుముల కాంబినేషన్‌లో తెరకెక్కనున్న చిత్రంలో ముందుగా తనే హీరోయిన్‌గా ఫిక్స్ అయ్యింది. కానీ ఆ తర్వాత ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్లు వార్తలు వెలువడ్డాయి. నాగార్జున సైతం 'ది ఘోస్ట్' మూవీ డిజాస్టర్ తర్వాత మరో సినిమా అప్‌డేట్ లేదు. ధమాకా రైటర్ ప్రసన్న కుమార్ బెజవాడ దర్శకత్వంలో ఒక సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి. కానీ ఆ ప్రాజెక్ట్ మెటీరియలైజ్ కాలేదు. ఇదే క్రమంలో బిగ్ బాస్ తెలుగు సీజన్ 7కు సిద్ధమయ్యారు నాగ్. త్వరలో ప్రారంభమయ్యే ధనుష్ మూవీలో ఆయన కీలక పాత్ర పోషించనున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Publishedat # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com